# తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం-27- ఆగస్టు - 2025 | సంపుటి : 3 | సంచిక : 92 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in





పాఠకులకు, ప్రకటనకర్తలకు,
ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు

## వినాయక చవితి శుభాకాంక్షలు

సెలవు

వినాయక చవితి సందర్భంగా నేడు తెలంగాణ ముచ్చట్లు ఆఫీసుకు సెలవు. కనుక గురువారం సంచిక వెలువడదు. మళ్లీ శుక్రవారం కలుద్దాం.


## ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

- లింగంపల్లి నుంచి వస్తుండగా బస్టాండ్ వద్ద ఆగిపోయిన బస్సు
- స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులను దించేసిన డ్రైవర్
- బాగుచేసే ప్రయత్నంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు

● 7లో

# స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు

నోటిఫికేషన్ విడుదల చేసిన ఎన్నికల కమిషన్

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్

ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు స్వీకరిస్తాం : ఎన్నికల సంఘం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం తన కసరత్తును రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. అందులో భాగంగా మంగళవారం గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పోలింగ్ కేంద్రాలు, తుది ఓటర్ల జాబితా విడుదలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ క్రమంలో నోటిఫై చేయబడిన అన్ని గ్రామ పంచాయతీల్లోని ఫోటో ఓటర్ల జాబితాను తయారు చేసి ప్రచురించాలని పంచాయతీ అధికారులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. గ్రామ పంచాయతీల ఓటర్ల జాబితా తయారీ ప్రచురణ కోసం షెడ్యూల్ సైతం విడుదల చేసింది. అయితే ఆగస్టు 28వ తేదీ లోపు గ్రామ పంచాయతీల ముసాయిదా ఓటర్ల జాబితా తయారీ




చేసి గ్రామ పంచాయతీ, మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితాలను ప్రదర్శించాలని జారీ చేసిన నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. ఇక ఆ మరునాడే..

● మిగతా 2లో



## తెలంగాణలో ఐదురోజులు వానలే

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణలో రాగల ఐదురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఒడిశా తీరాన్ని ఆనుకొని వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిరదని వెల్లడిరచింది. తుఫాను ప్రసరణ సముద్రమట్టానికి సగటున 7.6 కిలో మీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని.. ఎత్తుకు వెళ్లేకొద్దీ నైరుతి వైపునకు వంగి ఉందని.. పశ్చిమ వాయువ్య దిశగా కదిలి రాబోయే రెండురోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంది. ఈ క్రమంలో మంగళవారం భూపాలపల్లి, ములుగు జిల్లాల్లో

● మిగతా 2లో

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

- అసెంబ్లీ సమావేశాల నోటిఫికేషన్ విడుదల
- కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయాలు
- బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం ఇరుకులో
- పంచాయతీ ఎన్నికల గడువు ఒత్తిడి
- కాళేశ్వరం కమిషన్ నివేదికపై చర్చ
- యూరియా కొరత, రేషన్ కార్డులు, గృహాలపై చర్చ

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

ఈ నెల 30 నుంచి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేశారు. శాసనసభతో పాటు మండలి సమావేశాలు సైతం జరగనుండగా, ఎన్నిరోజులు సమావేశాలు నిర్వహించాలనే దానిపై బిజినెస్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్

● మిగతా 2లో




## సాదాబైనామాల సమస్యకు పరిష్కారం చూపిన భూభారతి

- కోర్టు స్టే తొలగింపు
- దరఖాస్తులకు త్వరలో మోక్షం

హైదరాబాద్,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):

భూభారతి చట్టం ద్వారా సాదాబైనామాల దరఖాస్తులకు తుది పరిష్కారం లభించనుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు .

మంగళవారం హైకోర్టు సాదాబైనామాలపై ఉన్న స్టేను తొలగించిందని, ఈ తీర్పుతో లక్షలాది పేద ప్రజల కలలు నెరవేరనున్నాయని అన్నారు.

● 2లో



# దేశవ్యాప్తంగా న్యాయవాదులపై పెరిగిపోతున్న దాడులు

- న్యాయవాదులపై దాడుల తీవ్రత పెరుగుదల
- కూకట్‌పల్లి ఘటనకు వ్యతిరేకంగా బహిష్కరణ
- మహబూబ్‌నగర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు
- న్యాయవాద రక్షణ చట్టం కోసం డిమాండ్
- దాడి బాధ్యులపై కఠిన చర్యల హెచ్చరిక
- ప్రభుత్వాలపై న్యాయవాదుల ఆగ్రహం
- సీనియర్ న్యాయవాదుల వ్యాఖ్యలు, సంఘీభావం

మహబూబ్‌నగర్, (తెలంగాణ ముచ్చట్లు) :

రాష్ట్రంలోనే కాకుండా దేశవ్యాప్తంగా న్యాయవాదులపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, అటువంటి దాడుల జరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని మహబూబ్నగర్ న్యాయవాద సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రావు కోరారు. కూకట్‌పల్లి న్యాయవాద సంఘంలోని ఓ న్యాయవాది విధులను అడ్డుకొని, అతనిపై విచక్షణారహితంగా దాడి చేసిన ఘటనను నిరసిస్తూ మంగళవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు.

● మిగతా 2లో




## భయాందోళనకు గురవుతున్న వైద్య విద్యార్థులు

- సీనియర్ల పైశాచికత్వంతో నరకం చూస్తున్న జూనియర్లు!
- నిజామాబాద్ జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సీనియర్, జూనియర్ మధ్య ర్యాగింగ్
- ఉన్నతాధికారులు స్థానికంగా లేకపోవడం వల్లనే ఈ గొడవలు జరుగుతున్నాయంటున్న తల్లిదండ్రులు

● 2లో



## ప్రియుడి మోజులో భర్తను చంపేసిన భార్య

- మూర్ఛ కారణంగా మృతి చెందాడని నమ్మించే ప్రయత్నం
- గల్ఫ్ నుంచి వచ్చిన కుమారుడికి అనుమానం వచ్చి పోలీసులకు ఫిర్యాదు
- విచారణలో నేరాన్ని అంగీకరించిన భార్య, ప్రియుడు




హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

తెలంగాణ రాష్ట్రంలోని నిర్మల్ జిల్లా, సోన్ మండలంలోని వెల్మల్‌లో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వివాహేతర సంబంధం మోజులో ఒక మహిళ తన భర్తను హత్య చేసింది. భర్త మూర్ఛతో మరణించాడని ఆమె నమ్మించే ప్రయత్నం చేసినప్పటికీ, కుమారుడికి అనుమానం రావడంతో అసలు విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, హరిచరణ్, నాగలక్ష్మి దంపతులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు.

● మిగతా 7లో

# తెలంగాణ శిశుసంక్షేమ ప్రాజెక్టు అధికారులపై సుప్రీం ఆగ్రహం

- ధర్మాసనం ముందు హాజరుకావాలని ఆదేశం

హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు)

జన్మనిచ్చిన తల్లిదండ్రులు లేని పిల్లలను దత్తత తీసుకున్న వారికి అప్పగించాలని ఈ నెల 12న తాము జారీ చేసిన ఆదేశాలను తెలంగాణ శిశుసంక్షేమ ప్రాజెక్టు డైరెక్టర్‌తో పాటు, ఇతర అధికారులు అమలు చేయకపోవడంపై

● మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సాదాబైనామాల సమస్యకు పరిష్కారం చూపిన భూభారతి

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం ప్రజలను నమ్మించి మోసం చేసిందని విమర్శిస్తూ, 2020 ఆర్ఓఆర్ చట్టంలో దరఖాస్తుల పరిష్కారానికి మార్గం చూపకపోవడంతో 9.26 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. దీనిపై కొందరు హైకోర్టును ఆశ్రయించగా, తమ ప్రభుత్వం కేసు ముగింపు కోసం కృషి చేసిందని పేర్కొన్నారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచన మేరకు భూభారతి చట్టంలో స్పష్టమైన నిబంధనలు తీసుకొచ్చామని, సాదాబైనామాల దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక పనులు ఇప్పటికే పూర్తి చేసినట్లు తెలిపారు.

గత ప్రభుత్వం అక్రమంగా అమలు చేసిన ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపేసి, దేశంలోని 18 రాష్ట్రాల్లో అధ్యయనం చేసి భూభారతి - 2025 చట్టాన్ని రూపొందించామని వివరించారు. రైతులు, ప్రజల సమస్యల పరిష్కారానికి సదస్సులు నిర్వహించగా 8.60 లక్షల దరఖాస్తులు అందాయని, ప్రతి ఒక్క దరఖాస్తును పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని మంత్రి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు.

# తెలంగాణలో ఐదురోజులు వానలే

(మొదటి పేజీ తరువాయి)

భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది. కొత్తగూడెం, హన్మకొండ, జనగాం, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మంచిర్యాల, నల్గొండ, పెద్దపల్లి, సూర్యాపేట, వరంగల్, భువనగిరి, మహబూబాబాద్ జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. బుధవారం కొత్తగూడెం, భూపాలపల్లి, ఆసిఫాబాద్, మంచిర్యాల, ములుగు జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని అంచనా వేసింది. గురువారం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో భారీ వర్షాలు పడుతాయని.. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది. శుక్రవారం ఆదిలాబాద్,



కొత్తగూడెం, హన్మకొండ, హైదరాబాద్, జగిత్యాల, జనగాం, భూపాలపల్లి, కామారెడ్డి, కరీంనగర్, ఖమ్మం, ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, ములుగు, నల్గొండ, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల, రంగారెడ్డి, సంగారెడ్డి, సిద్దిపేట, సూర్యాపేట, వికారాబాద్, వరంగల్, భువనగిరి జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. శనివారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భూపాలపల్లి, కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వానలు పడే సూచనలున్నాయని చెప్పింది.

# 30 నుంచి అసెంబ్లీ సమావేశాలు

(మొదటి పేజీ తరువాయి)

సమర్పించిన విచారణ నివేదికపై సభలో చర్చించే అవకాశం ఉంది.

కాగా అదేరోజు రాష్ట్ర మంత్రివర్గం కూడా సమావేశం కానుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన మధ్యాహ్నం ఒంటి గంటకు కేబినెట్ భేటీ ప్రారంభం కానుంది. రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంలో ఎదురవుతున్న ఆటంకాలు, అసెంబ్లీ సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోనున్నారు.




**బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనపై ప్రత్యేక దృష్టి**

ఒకవైపు సెపెటంబర్ 30లోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర హైకోర్టు విధించిన గడువు సమీపిస్తోంది. మరోవైపు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతూ రాష్ట్ర శాసనసభలో ఆమోదించిన బిల్లులను గవర్నర్ ఆమోదించకుండా రాష్ట్రపతి పరిశీలన కోసం పంపించారు.

బీసీ రిజర్వేషన్లకు సంబంధించి మరో ప్రయత్నంగా ఆర్డినెన్స్‌లను రూపొందించి పంపగా వాటిని సైతం గవర్నర్ రాష్ట్రపతికి సిఫారసు చేయడంతో ప్రభుత్వం తీవ్ర ఇరకాటంలో పడింది. ఈ నేపథ్యంలోనే పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు తదితర అంశాలపై కేబినెట్ చర్చించి నిర్ణయం తీసుకోనుంది.

**కాళేశ్వరం కమిషన్ నివేదిక, యూరియా కొరత తదితరాలపై..**

కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ సమర్పించిన విచారణ నివేదికను శాసనసభలో ప్రవేశపెట్టి చర్చించాలని భావిస్తున్న నేపథ్యంలో.. దీనిపై సైతం మంత్రివర్గంలో చర్చించి నిర్ణయం తీసుకోనుంది. అలాగే రాష్ట్రంలో నెలకొన్న యూరియా కొరత, కొత్త రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ గృహాల నిర్మాణం, ఉద్యోగుల సమస్యలు, ఉద్యోగ నియామకాలు తదితర అంశాలను కూడా మంత్రివర్గం పరిశీలించే అవకాశం ఉంది.

# దేశవ్యాప్తంగా న్యాయవాదులపై పెరిగిపోతున్న దాడులు

(మొదటి పేజీ తరువాయి)

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు విధులను బహిష్కరించడం జరిగిందని ఆయన తెలిపారు. ప్రతిరోజు న్యాయవాదులపట్ల దాడులు పెరిగిపోతున్నాయని, అటువంటి దాడులను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. న్యాయవాదులకు రక్షణగా ప్రభుత్వం వెంటనే రక్షణ చట్టాన్ని తీసుకురావాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో న్యాయవాదులపై దాడులు జరిగితే సహించేది లేదని హెచ్చరించారు. న్యాయవాదిపై దాడికి బాధ్యులైన వారందరిపై కేసు నమోదు చేసి వెంటనే అరెస్ట్ చేసి రిమాండ్ పంపాలని డిమాండ్ చేశారు. న్యాయవాద సంఘం మాజీ అధ్యక్షుడు చంద్రమౌళి, సీనియర్ న్యాయవాది ఎంపీ వెంకటేశ్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకొని న్యాయవాద రక్షణ చట్టాన్ని వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. బాధ్యతాయుతమైన న్యాయవాద వృత్తిలో ఉన్న న్యాయవాదుల పట్ల అమానుషంగా ప్రవర్తించడం సరికాదన్నారు. భవిష్యత్తులో న్యాయవాదులపై దాడులు జరగకుండా రాసిన బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. కార్యక్రమంలో కోశాధికారి వెంకట్రావు, కార్యవర్గ సభ్యులు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.




# స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

అంటే ఆగస్టు 29వ తేదీన ఎంపీడీవోల ద్వారా మండల స్థాయిలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించనున్నారు. ఆగస్టు 30వ తేదీన ఓటర్ల జాబితాపై అభ్యంతరాల స్వీకరిస్తామని ఎన్నికల సంఘం వెల్లడిరచింది. అలాగే ఆగస్టు 31వ తేదీన జిల్లా పంచాయతీ అధికారి గ్రామ పంచాయతీల వార్డుల వారీగా ఫోటో ఓటర్ల తుది జాబితాలను ప్రచురణ చేస్తారని ఎన్నికల సంఘం తెలిపింది.




ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. గడువు ముగిసిన స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లను విచారించిన హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. సెప్టెంబర్ 30వ తేదీలోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించింది. 2024, జనవరి 31వ తేదీతో సర్పంచుల పదవీ కాలం ముగిసింది. దీంతో ఏడాదిన్నరగా ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించడం లేదంటూ పలువురు కోర్టును ఆశ్రయించారు. దీంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువరించింది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లకు సంబంధించిన బిల్.. తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందింది. అనంతరం కేంద్రానికి పంపింది. దీనిపై కేంద్రం ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఈ నేపథ్యంలో ఈ బిల్లును అమోదించాలంటూ తెలంగాణలోని అధికార కాంగ్రెస్ పార్టీతోపాటు ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు దేశ రాజధాని న్యూఢల్లీ వేదికగా ఆందోళనలు చేపట్టిన విషయం విదితమే. ఇంకోవైపు ఈ బిల్లు ఆమోదం కోసం అధికార పార్టీ కాంగ్రెస్ పార్టీతోపాటు బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒకదానిపై ఒకటి విమర్శలు, ప్రతి విమర్శలు చేసుకుంటున్నాయి.

# భయాందోళనకు గురవుతున్న వైద్య విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

కష్టపడి వైద్య విద్యలో ప్రవేశాలు పొందుతున్న విద్యార్థులకు చేదు అనుభవాలు తప్పడం లేదు. సాధారణంగా కాలేజీల ప్రారంభ సమయంలో ఇలాంటి ర్యాగింగ్‌లు జరుగుతుంటాయి. కానీ ఇక్కడ దాదాపు నాలుగేళ్ల పాటూ తమ సీనియర్ల నుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీలో సీనియర్, జూనియర్ విద్యార్థుల మధ్య ర్యాగింగ్ భూతం బయటకు వస్తోంది. ఇలాంటి విష సంస్కృతి విద్యార్థుల మధ్య చిచ్చుపెడుతోంది. జూనియర్లను వేధించాలన్న సీనియర్ల పైశాచిక ఆనందం వారి జీవితాలను నాశనం చేస్తోంది. అంతేకాదు వారి ప్రాణాలు హరిస్తోంది. చివరికి తమ పిల్లల భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకునే తల్లిదండ్రులకు తీరని వేదన మిగుల్చుతుంది. ఇటీవల నిజామాబాద్ జిల్లా వైద్య కళాశాలలో జరిగిన సంఘటనలో బాధిత ఎంబీబీఎస్ విద్యార్థి ఆవేదన ఇదే స్పష్టం చేస్తోంది. కొంతమంది సీనియర్లు సహ విద్యార్థులను భయాందోళనకు గురి చేయడం మిగతా వారిపై ప్రభావం చూపుతోంది. దీని అంతటికీ ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమే కారణంగా కనిపిస్తోంది.



నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ నాలుగో సంవత్సరం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని సీనియర్లు కొందరు ర్యాగింగ్ చేయడం కలకలం సృష్టించింది. ఈ లెక్కన ఫస్ట్ ఇయర్, సెంకడ్ ఇయర్ చదివే వారి పరిస్థితి ఏమిటో వేరే చెప్పక్కర్లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. వేరు వేరు ప్రాంతాల నుంచి వచ్చి చదువుతున్న విద్యార్థులు ఒకరితో మరొకరు స్నేహపూర్వకంగా ఉండకుండా, గ్రూపులుగా విడిపోతున్నారు. కాలేజీలో గొడవలు, ర్యాగింగ్‌లకు పాల్పడటం పరిపాటిగా మారింది. విద్యార్థులను సమర్థంగా కట్టడి చేయాల్సిన అధికారులే ఏదైనా ఘటన జరిగితే బయటకు రాకుండా ఉండేందుకు ఎక్కువగా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాల, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అధికారులు స్థానికంగా ఉండకపోవడంతో పర్యవేక్షణ లోపం జరుగుతోంది. దీన్ని కొంతమంది స్థానిక వైద్యులు ఆసరాగా చేసుకుని అనధికారిక ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. దీంతో విద్యార్థుల మధ్య గొడవలు తరచూ జరుగుతున్నాయి. ఇటీవల వైద్య విద్య సంచాలకుడు నరేంద్రకుమార్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్‌లు కళాశాల, ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో అధికారులు అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశమైంది.

# తెలంగాణ శిశుసంక్షేమ ప్రాజెక్టు అధికారులపై సుప్రీం ఆగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. అధికారులంతా కోర్టు ధిక్కరణ కింద న్యాయస్థానం ముందు హాజరు కావాలని సోమవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీష్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం ఆదేశించింది. ఆగస్టు 12వ తేదీన ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రివ్యూ పిటిషన్ వేసినందునే తాము పిల్లలను అప్పగించలేదన్న తెలంగాణ ప్రభుత్వ అధికారుల వాదనలను తోసిపుచ్చింది. రివ్యూ పిటిషన్ వేసినంత మాత్రాన తమ తీర్పుపై స్టే ఇచ్చినట్లు కాదని కోర్టు తెలిపింది. అప్పుడు అధికారుల తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్యభాటీ జోక్యం చేసుకుంటూ రివ్యూ పిటిషన్‌లో వచ్చే ఉత్తర్వులకు లోబడి తాము వెంటనే పిల్లలను పెంపెడు తల్లిదండ్రులకు అప్పగిస్తామని, కోర్టు ధిక్కరణ చర్యలు చేపట్టవద్దని విన్నవించారు. దీనిని పరిగణలోకి తీసుకున్న న్యాయమూర్తి జస్టిస్ బీవీ నాగరత్న నలుగురు పిల్లలనూ ఇవాళ పెంపుడు తల్లిదండ్రులకు అప్పగించి ఆ విషయాన్ని కోర్టుకు తెలియజేయాలని నిర్దేశించారు.



సెప్టెంబరు 2న సంబంధిత అధికారులంతా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తమ ముందు హాజరు కావాలని ఆదేశించారు. పిల్లల కోసం పనిచేస్తున్న సంస్థ తరపున మరో సీనియర్ న్యాయవాది గోపాల్‌శంకర్ నారాయణన్ జోక్యం చేసుకుంటూ కొనుగోలు చేసిన వారికి పిల్లలను ఇచ్చేయడం విపరిణామాలకు దారితీసే ప్రమాదం ఉందన్నారు. జస్టిస్ బీవీ నాగరత్న స్పందిస్తూ తాము ఈ తీర్పును సార్వత్రికంగా అందరినీ ఉద్దేశించేలా జారీ చేయలేదని, ఆర్టికల్ 142ని ఉపయోగించి కేవలం ఈ నలుగురు పిల్లలకు మాత్రమే పరిమితం చేస్తున్నామని స్పష్టం చేశారు. కొంతమంది దంపతులు చట్టబద్ధంగా దత్తత తీసుకోకుండా పిల్లలను పెంచుకుంటున్నారని తెలిసి హైదరాబాద్ పోలీసులు ఈ సంవత్సరం మే 22న వారిని తీసుకెళ్లి చిన్నారుల సంరక్షణ కేంద్రంలో అప్పగించారు. దాన్ని సవాల్ చేస్తూ దత్తత తల్లిదండ్రులు మొదట తెలంగాణ హైకోర్టును తర్వాత సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తమ పిల్లలను ఆగస్టు 14 సాయంత్రంలోగా పెంపుడు తల్లిదండ్రులు అప్పగించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. అధికారులు ఆ పని చేయకపోవడంతో పెంపుడు తల్లిదండ్రులు దాఖలు చేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌పై సోమవారం ఆ ధర్మాసనం విచారణ చేపట్టి పైవిధంగా ఉత్తర్వులు జారీ చేసింది.




# కాలి దప్పి మాట్లాడుతున్న కడియం

## మాజీ ఎమ్మెల్యే రాజయ్య
## రైతుల కోసం యూరియా లేదు.. ప్రజల కోసం అభివృద్ధి లేదు

స్టేషన్ ఘనపూర్ ఆగస్టు/26 (తెలంగాణ ముచ్చట్లు)

స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో మాజీ ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, ఆయన వారసుడు రాజకీయ ప్రయాణంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. "అభివృద్ధి అనే నెపంతో పార్టీలు మారడమే తప్ప ఘనపూర్‌లో ఎలాంటి మార్పు కనిపించడంలేదు" అని స్థానికులు ధ్వజమెత్తుతున్నారు.

మాజీ ఎమ్మెల్యే రాజయ్య వ్యాఖ్యలతో మరోసారి కడియం రాజకీయాలు చర్చనీయాంశమయ్యాయి. "తండ్రి-బిడ్డ జంపులకే ప్రాధాన్యం తప్ప ప్రజల అభివృద్ధి కోసం కడియం మార్క్ ఎక్కడా కనబడలేదు. కనీసం నియోజకవర్గానికి వెయ్యి కోట్లు తేల్చ లేని అసమర్థుడు కడియం శ్రీహరి" అంటూ ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు.

ఒకప్పుడు చంద్రబాబుకు వెన్నుపోటు పొడిచి కేసీఆర్ సంకలో చేరిన కడియం, ఇప్పుడు కేసీఆర్‌కే వెన్నుపోటు పొడిచి రేవంత్ రెడ్డి సన్నిహితుల్లో చేరాడనే ఆరోపణలు రాజకీయ వర్గాల్లో గట్టిగా వినిపిస్తున్నాయి. "తనను నమ్మిన వారికే వెన్నుపోటు పొడవడం కడియం పని" అని విమర్శకులు మండిపడుతున్నారు.

బిర్లా ఐలయ్య 1560 కోట్లు, నాయిని రాజేందర్ రెడ్డి 6000 కోట్లు తెచ్చి చూపించగా, కడియం శ్రీహరి మాత్రం కనీసం వెయ్యి కోట్ల రూపాయల నిధులు కూడా ఘనపూర్‌కు తేల్చలేకపోయాడనే ఆరోపణలు మరింత బలంగా వినిపిస్తున్నాయి.

ప్రజలు అడుగుతున్న ప్రశ్న - "దశాబ్దాలుగా కడియం మార్క్ అంటే ఏంటి? మాకు రోడ్లు, నీరు, ఉపాధి ఎక్కడ ఉన్నాయి?"

విమర్శకులు వ్యంగ్యంగా "75 ఏళ్లు దాటాడు కాబట్టి కాలి తప్పి కడియం శ్రీహరి మాట్లాడుతున్నాడు, మాటలే తప్ప పనులు లేవు" అని ఎద్దేవా చేస్తున్నారు.

యూరియా కోసం రైతుల పడి కాపులు - నాయకులు, అధికారులు ఎక్కడ?

వరి నాట్లు జోరందుకున్న ఈ సమయంలో రైతులకు అత్యవసరమైన యూరియా ఎరువులే అందకపోవడం ఆగ్రహానికి గురి చేస్తోంది. తెల్లవారుజాము నుంచే ఎరువుల డిపోల ఎదుట క్యూల్లో నిలబడి, వర్షంలో తడుస్తూ సాయంత్రం వరకు ఎదురుచూడాల్సిన దుస్థితి.

"ప్రభుత్వం మాపై జాలి లేకపోవడమే స్పష్టంగా కనిపిస్తోంది. నాటు వేసే వరకు రాత్రింబవళ్లు కష్టపడి పొలాలను సిద్ధం చేసుకున్నాం. ఇప్పుడు ఒక్క యూరియా సంచి కోసం వర్షంలో పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఇది మాకెంత అవమానకరమో ఎవరూ పట్టించుకోవడంలేదు" అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

"ఫోటోలు దిగడానికే నాయకులు ముందుంటారు, కానీ రైతుల సమస్యలు తీర్చడంలో ఒక్క అడుగు కూడా ముందుకు వేయరు. అధికారులు కూడా నోరు మూసుకుని కూర్చున్నారు" అని రైతులు మండిపడుతున్నారు.

ఎరువులు అందకపోతే పంటలు నాశనం కావడం ఖాయం అని, ఆ నష్టాన్ని ఎవరు భరించాలనే ప్రశ్నను రైతులు నేరుగా ప్రభుత్వానికి విసురుతున్నారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్, మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ చందర్ రెడ్డి, పార్శి రంగన్న, మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్, మారేపల్లి ప్రసాద్, చేపూరి గణేష్, గుండె మల్లేష్, చింత శ్రీనివాస్ తదితర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.




# కాలుష్యంతో అల్లాడుతున్న పల్లె

## రోడ్డుపైనే నాట్లు వేసి వినూత్న నిరసన తెలిపిన గ్రామస్థులు

స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)

జనగామ జిల్లా, స్టేషన్ ఘనాపూర్ మండలం: తానేదార్పల్లి గ్రామ ప్రజల జీవన విధానం కాలుష్యంతో తల్లడిల్లుతోంది. సరైన రహదారులు లేని ఈ గ్రామంలో భారీ ట్రక్కుల ద్వారా జరుగుతున్న మట్టి రవాణా స్థానికులకు భరించలేని ఇబ్బందులను తెచ్చిపెట్టింది.

రహదారులపై నిరంతరం తిరుగుతున్న ట్రక్కుల కారణంగా రోడ్లు అస్తవ్యస్తమైపోవడంతోపాటు, ఎగిరే దుమ్ముతో గ్రామ ప్రజలు శ్వాస సంబంధిత వ్యాధులు, కంటి సమస్యలు, చర్మవ్యాధులు వంటి అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. వర్షం పడితే ఈ రహదారులు పూర్తిగా మురికితో నిండిపోతూ, నడవడానికి, వాహనాలు నడపడానికి కూడా కష్టంగా మారుతున్నాయి.

హౌసింగ్ ప్రాజెక్ట్ కూడా ఇబ్బందుల్లోనే

ఇటీవల ఈ గ్రామం ఇందిరమ్మ హౌసింగ్ పైలెట్ ప్రాజెక్ట్ కింద ఎంపిక కావడంతో దాదాపు 100 ఇండ్ల నిర్మాణం ప్రారంభమైంది. అయితే, నిర్మాణ సామగ్రి తీసుకొచ్చే వాహనదారులు "రోడ్లు బాగాలేదు, మా బండ్లు పాడైపోతాయి" అంటూ అధిక కిరాయిలు వసూలు చేస్తున్నారు. దీంతో లబ్ధిదారులు ఆర్థికంగా మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. "అత్యవసర పరిస్థితిలో హాస్పిటల్‌కి వెళ్లాలన్నా వాహనాలు రాకుండా పోతున్నాయి. ఆటో డ్రైవర్లు కూడా మా రోడ్డుని చూసి వెనుదిరుగుతున్నారు" అని గ్రామస్తులు వాపోతున్నారు.

గ్రామస్తుల అనుమతి లేకుండానే మైనింగ్

స్థానికుల వాదన ప్రకారం, వారి అనుమతి లేకుండానే అధికారులు మైనింగ్ అనుమతులు మంజూరు చేశారు. "ఎన్నిసార్లు అడ్డుకున్నా ఫలితం లేదు. లెక్కకు మించి లోడ్లు వేసి మట్టిని తరలిస్తున్నారు. మా సమస్యలపై ఎవరూ స్పందించడం లేదు" అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వినూత్న నిరసన - రోడ్డుపైనే నాట్లు

తమ సమస్యలపై అధికారుల దృష్టి పడేలా గ్రామ ప్రజలు రోడ్డుపైనే నాట్లు వేసి వినూత్న నిరసన చేపట్టారు.

"మా గోడును వినిపించుకోవడానికి ఇంతదూరం వచ్చాం. ఇప్పుడు అయినా అధికారులు స్పందించి గ్రామానికి శాశ్వత పరిష్కారం చూపుతారని ఆశిస్తున్నాం" అని గ్రామస్థులు స్పష్టంచేశారు.

# సత్తుపల్లిలో మదర్ థెరిసా 115వ జయంతి ఘనంగా

## మదర్ థెరిసా స్ఫూర్తి మార్గంలో నడవాలి – మట్టా దయానంద్

సత్తుపల్లి, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):

సత్తుపల్లి పట్టణంలో మదర్ థెరిసా 115వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సమాజ సేవకు ప్రతీకగా నిలిచిన ఆమె సేవా స్ఫూర్తిని స్మరించుకుంటూ ప్రముఖులు మట్టా దయానంద్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మట్టా దయానంద్ మాట్లాడుతూ మదర్ థెరిసా 1910 ఆగస్టు 26న స్కోప్జే నగరంలో జన్మించారని, ఆమె అసలు పేరు అగ్నెస్ గోంఝా బోజాక్షియు అని తెలిపారు. చిన్న వయస్సులోనే మానవతా సేవ పట్ల ఆకర్షితమై పేదల కోసం జీవితమంతా అంకితం చేశారని చెప్పారు. 1950లో మిషనరీస్ ఆఫ్ చారిటీ అనే సంస్థను స్థాపించి నిరుపేదలు, రోగులు, అనాథలకు అండగా నిలిచారని గుర్తుచేశారు. ఆమె చేసిన సేవలకు గుర్తింపుగా 1979లో నోబెల్ శాంతి బహుమతి లభించిందని తెలిపారు. మదర్ థెరిసా సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో చల్లగుళ్ళ నరసింహారావు, దొడ్డా శ్రీను, కమల్ బాషా, గాదె చిన్నారావు సహా పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే స్థానిక విద్యార్థులు, ప్రజలు హాజరై మదర్ థెరిసా సేవా వారసత్వానికి ఘన నివాళి అర్పించారు.





# ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దిన గురువు రుణం తీర్చలేనిది

## మా గురువర్యులు రాజనర్సయ్య ఫిట్‌నెస్, క్రమశిక్షణ ప్రతిఒక్కరికీ ఆదర్శం ఇంటెలిజెన్స్ ఎస్పీ రమేష్

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)

ఉత్తమ వ్యక్తులుగా తీర్చిదిద్దిన గురువుల రుణం ఎప్పటికీ తీర్చలేనిదని ఇంటెలిజెన్స్ ఎస్పీ రమేష్ అన్నారు. రిటైర్డ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ డోలీ రాజనర్సయ్య 86వ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఖమ్మం ఖానాపురం హవేలీ మినీ ట్యాంక్‌బండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ రమేష్ మాట్లాడుతూ... నిరంతరం ప్రజలతో కలిసి ఉంటే వృద్ధాప్య ఛాయలు రావు అంటూ రిటైర్డ్ తర్వాత కూడా వ్యాయామం చేయడం వల్ల అనారోగ్య సమస్యలు దరిదాపుల్లోకి కూడా రావని ఇప్పటి తరానికి గురువర్యులు 86 ఏళ్ల డోలి రాజనర్సయ్య ఆదర్శంగా నిలుస్తున్నారని ఇంటెలిజెన్స్ ఎస్పీ రమేష్ పేర్కొన్నారు. తన గురువు అయిన రాజనర్సయ్య ఎంతో మందికి ఆదర్శంగా నిలిచారని, నిత్యం వాకింగ్ చేస్తూ ఫిట్నెస్ గా ఉంటున్నారన్నారు. తాను ములుగు జిల్లా వెంకటాపురంలో రాజనర్సయ్య వద్ద చదువుకున్నానని గుర్తు చేసుకున్నారు. తమలాంటి ఎంతోమంది విద్యార్థులను ఉన్నతమైన వ్యక్తులుగా తీర్చిదిద్దినందుకు గురువును ఆయన కొనియాడారు. డోలీ రాజనర్సయ్య ఫిట్‌నెస్, క్రమశిక్షణ ప్రతి ఒక్కరిరూ ఆదర్శంగా తీసుకోవాలని ఎస్పీ అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వాకర్ ఆలేటి శ్రీనివాసరావుతో పాటు సుమారు 100 మంది వాకర్స్ పాల్గొన్నారు. అనంతరం ట్యాంక్‌బండ్ వద్ద మొక్కలు నాటారు.



# జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారికి శుభాకాంక్షలు తెలిపిన ఎంపీజే బృందం

ఖమ్మం బ్యూరో,ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)

మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపీజే) అధ్యక్షులు షేక్ ఖాసిం, తన బృందంతో కలిసి నూతన కలెక్టరేట్‌లో, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన మొహమ్మద్ ముజాహిద్‌ను మర్యాద పూర్వకంగా కలసి, శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా మైనారిటీ సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయిలో మరింత సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. అధికారి ముజాహిద్ కూడా సంస్థ ప్రతినిధులతో సానుకూలంగా స్పందించి సహకారం అందిస్తామని తెలిపారు.

కార్యక్రమంలో ఎంపీజే జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఎ. గఫార్, కోశాధికారి ఎం.డి. హకీమ్, కార్యదర్శి సయ్యద్ రఫీ, సభ్యులు ఎం.డి. పాషా తదితరులు పాల్గొన్నారు.



# రైతన్నలకు సకాలంలో ఎరువులు ఇవ్వాలని బీఆర్ఎస్ వినూత్న నిరసన

వనపర్తి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):

రైతన్నలకు సకాలంలో ఎరువులు అందించాలంటూ బీఆర్ఎస్ నాయకులు వినూత్నంగా నిరసన తెలిపారు. గట్టు యాదవ్ జిల్లా అధ్యక్షులు ఆధ్వర్యంలో, దున్నపోతుతో ప్రభుత్వానికి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ - "రాష్ట్రంలో కాంగ్రెస్, బీజేపీల దొంగాటల వల్ల రైతాంగం నడ్డి విరుస్తోంది. ఎరువులు సమయానికి అందించకపోగా, ఒకరు ఇచ్చామని, మరొకరు ఇవ్వలేదని డ్రామాలు ఆడుతున్నారు. ఈ క్రమంలో ఎరువులు బ్లాక్ మార్కెట్‌లో అమ్మకాలు జరుగుతున్నాయి. దీనిపై మేము నిరసన చేపట్టగానే పోలీసులతో అరెస్టులు చేస్తున్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం మిగల్లేదు. అధికారులు, పోలీసులు అధికార పార్టీకి బానిసలుగా మారారు. న్యాయం అడిగితే అరెస్టులు అవుతున్నాయి. అందుకే ఈసారి దున్నపోతు ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయాల్సి వచ్చింది" అని వ్యాఖ్యానించారు.

ఈ నిరసన కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మాజీ మార్కెట్ చైర్మన్ రమేష్ గౌడ్, పరంజ్యోతి, మాజీ కౌన్సిలర్ నాగన్న యాదవ్, ఉంగ్లం తిరుమల్, ప్రేమ్ నాథ్ రెడ్డి, కంచరవి, స్టార్ రహీం, డేగ మహేశ్వర్ రెడ్డి, మాధవరెడ్డి, హేమంత్ ముదిరాజ్, అవిశెట్టి భాగ్యరాజ్, జోహేబ్ హుస్సేన్, ఇమ్రాన్, చిట్యాల రాము, ఆరిఫ్, గాడిదల మోహన్, బాల్ రాజ్, నందిమల్ల సుబ్బు, అలీమ్, అనుపటి రాము, సంతోష్, ముని కుమార్, జెర్రీ, సాదిక్, వాటర్ మహబూబ్, ఖాదర్, లక్ష్మణ్ గౌడ్, వెంకటేష్, తోట శ్రీను, శంకర్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# పర్యావరణహిత వినాయక చవితి లక్ష్యంగా మట్టి విగ్రహాల పంపిణీ

**మీర్పేట్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

వినాయక చవితి వేడుకలను పర్యావరణ హితంగా జరుపుకోవాలని పిలుపునిస్తూ బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రామ్ ప్రదీప్ మునుగంటి ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టారు. మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీ అసోసియేషన్లు మరియు కుల సంఘాలకు స్వయంగా వెళ్లి మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణానికి మేలు చేసే విధంగా మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకోవాలని ప్రతి ఒక్కరు సంకల్పించుకోవాలని పిలుపునిచ్చారు. భవిష్యత్ తరాలకు ప్రకృతి అందాలను కాపాడడం అందరి బాధ్యత అని రామ్ ప్రదీప్ మునుగంటి పేర్కొన్నారు.స్థానిక నివాసితులు ఈ ప్రయత్నాన్ని అభినందిస్తూ, "మట్టి విగ్రహాల వలన నదులు, చెరువులు కలుషితం కావడం తగ్గుతుంది" అని అభిప్రాయపడ్డారు.



# వినాయక మండపాలకు లడ్డూ పంపిణీ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

**మల్కాజ్గిరి, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)**

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మల్కాజ్గిరి శాసనసభ నియోజకవర్గంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. జెకె నగర్ కాలనీ అధ్యక్షుడు ముద్దం ధర్మేష్ యాదవ్ ఆధ్వర్యంలో, బీఆర్ఎస్ యువ నాయకుడు సంపత్ యాదవ్ నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో వినాయక్ నగర్ డివిజన్ పరిధిలోని ప్రతి వినాయక మండపానికి 5 కిలోల లడ్డూలు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి స్వయంగా ప్రతి మండప నిర్వాహకులకు లడ్డూలు అందజేశారు. ప్రజలతో సాన్నిహితంగా మమేకమవుతూ పండుగ ఉత్సాహాన్ని పంచుకున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, "వినాయక చవితి పండుగ సమాజంలో ఐక్యతను, భక్తి భావాన్ని పెంపొందిస్తుంది. ఇలాంటి సామాజిక కార్యక్రమాలు ప్రజల్లో ఉత్సాహాన్ని నింపుతాయి. మండపాల నిర్వాహకులకు స్వయంగా లడ్డూలు అందజేయడం గర్వకారణం," అని తెలిపారు.

ఈ వేడుకలో బీఆర్ఎస్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, జేపీసీ వెంకన్న, ధర్మేష్ యాదవ్, సంపత్ యాదవ్, శ్రీకాంత్ యాదవ్, హేమంత్ రెడ్డి, సాయి గౌడ్, ఫరీద్, బాలకృష్ణ, శ్రీకాంత్ యాదవ్ (పేపర్), శీను, కృష్ణ, సర్వేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పండుగ వాతావరణాన్ని మరింత ఉత్సాహభరితంగా మార్చారు.

# సేవాస్ఫూర్తితో జక్కుల కిరణ్ ముదిరాజ్

**వినాయక నగర్‌లో వెయ్యి మందికి ఉచిత మట్టి గణపతుల పంపిణీ**
**పర్యావరణ పరిరక్షణపై పిలుపు**

**మల్కాజ్గిరి, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)**



వినాయక చవితి పర్వదినం మరింత భక్తి వైభవాలతో సాగాలని సంకల్పించి బిజేవైఎం మేడ్చల్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ జక్కుల కిరణ్ ముదిరాజ్ ఆదర్శప్రాయమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టారు. మల్కాజ్గిరి నియోజకవర్గంలోని వినాయక నగర్ డివిజన్‌లో వెయ్యి మట్టి వినాయక విగ్రహాలను స్వయంగా సొంత ఖర్చుతో భక్తులకు ఉచితంగా పంపిణీ చేసి సేవాస్ఫూర్తి చాటుకున్నారు. విగ్రహాల ధరలు విపరీతంగా పెరిగిన ఈ రోజుల్లో సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు కిరణ్ ముదిరాజ్ తెలిపారు. కాలుష్యం పెరుగుతున్న ఈ రోజుల్లో పర్యావరణాన్ని కాపాడటానికి మట్టి గణపతుల ప్రతిష్ఠ అవసరం. సంప్రదాయ పద్ధతుల్లో పండుగ జరపడం ద్వారా మన సంస్కృతి సజీవంగా నిలుస్తుంది" అని ఆయన పిలుపునిచ్చారు.భక్తి,

భద్రత, పర్యావరణ పరిరక్షణ - మూడు లక్ష్యాలు జక్కుల కిరణ్ ముదిరాజ్ పండుగ నిర్వహణపై మండప నిర్వాహకులకు పలు సూచనలు చేశారు:

మండప నిర్మాణంలో శుభ్రత - స్వచ్ఛతతోనే పండుగ శోభ పెరుగుతుందని సూచించారు. విద్యుత్ భద్రత - విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా అమర్చాలని సూచించారు. అఖండ దీపం జాగ్రత్తలు - మండపాల్లో దీపాలు వెలిగించే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి.

ఉత్సవ క్రమశిక్షణ - శోభాయాత్రలు, నవ రాత్రి వేడుకలలో క్రమశిక్షణ పాటించాలి.

శాస్త్రబద్ధ పూజలు - పూజా విధానాలు సంప్రదాయబద్ధంగా జరగాలని సూచించారు. "వినాయక చవితి పండుగ కేవలం ఆచారం కాదు, ఆధ్యాత్మికతను, పర్యావరణ చైతన్యాన్ని కలిపే సాంస్కృతిక పండుగ. ప్రతి ఒక్కరూ ఈ పండుగను గౌరవంగా జరుపుకోవాలి" అని ఆయన పేర్కొన్నారు.

ప్రజల ప్రశంసల వర్షం

ఈ విగ్రహాల పంపిణీ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మండప నిర్వాహకులు, భక్తులు పాల్గొని జక్కుల కిరణ్ ముదిరాజ్ సేవా తత్వాన్ని ప్రశంసలతో ముంచెత్తారు. వినాయక నగర్ ప్రాంతం పండుగ ఉత్సాహంతో కిక్కిరిసిపోయింది. పర్యావరణహిత మట్టి గణపతుల ప్రాధాన్యాన్ని చాటి చెప్పిన ఈ కార్యక్రమం అందరికీ ఆదర్శం అవుతోంది.

# బిహార్‌లో రానున్నది ఇండియా కూటమే

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య.. బీహార్ సుపాల్‌లో ఓటర్ అధికార్ యాత్రలో పాల్గొన్న వరంగల్ ఎంపీ**

**వరంగల్,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**





బీహార్ సుపాల్‌లో నిర్వహించిన ఓటర్ అధికార్ యాత్రలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో పాటు వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాల మహిళా ఎంపీల బృందంలో భాగమై ఆమె అక్కడి ప్రజలతో మమేకమయ్యారు.

ప్రజల గోసలు విన్న ఎంపీ

యాత్ర సందర్భంగా స్థానిక యువత తమ సమస్యలను ఎంపీకి వివరించారు. "మాకు ఉద్యోగాలు కావాలి, కానీ ప్రభుత్వం మమ్మల్ని మోసం చేస్తోంది" అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒక ఉపాధ్యాయురాలు మాట్లాడుతూ, "నితీష్ ప్రభుత్వంపై విశ్వాసం పోయింది, ఇప్పుడు కొత్త మార్పు కావాలి" అని తెలిపింది.

ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తి

ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, బీహార్ లో నితీష్ కుమార్-బీజేపీ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని అన్నారు. ఉద్యోగాలు లేక వలసలు పెరిగిపోవడం, ఓటర్ల జాబితా నుంచి పేర్లు తొలగించడం ప్రజల్లో ఆగ్రహానికి దారి తీసిందని పేర్కొన్నారు.

మార్పు దిశగా బిహార్

ప్రజలు ఇప్పుడు ఇండియా కూటమి వైపు చూస్తున్నారని, వారి సమస్యలకు పరిష్కారం చూపగలిగేది ఈ కూటమేనని ఎంపీ స్పష్టం చేశారు. "ప్రజల సమస్యలను విని వాటికి పరిష్కారం చూపే ప్రభుత్వం ఒక్క ఇండియా కూటమికే సాధ్యం" అని చెప్పారు. అందుకే బిహార్ ప్రజలు మార్పు కోసం ఎదురుచూస్తున్నారని ఆమె అన్నారు.



# చర్లపల్లి లోకమాత కాలనీ అసోసియేషన్ ఆఫీస్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారి

**చర్లపల్లి, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో లోకమాత కాలనీ అసోసియేషన్ ఆఫీస్ రూమ్‌ను ఘనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి రిబ్బన్ కట్ చేసి ఆఫీస్‌ను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాలనీల అభివృద్ధి తమకు ముఖ్య లక్ష్యమని, ప్రతి కుటుంబం సౌకర్యవంతమైన వాతావరణంలో నివసించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కాలనీ వాసులు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి తక్షణ పరిష్కారం కోరారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే అన్ని సమస్యలను క్రమంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు.

కాలనీలో వీధి లైట్లు, రోడ్లు, నీటి సరఫరా, పారిశుద్ధ్య సమస్యలు పరిష్కారానికి త్వరితగతిన అధికారులను ఆదేశిస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకం కావడానికి ఇలాంటి సంఘాల ఆఫీసులు వేదికలుగా మారతాయని అన్నారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో హాజరై ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. కాలనీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్థానిక నాయకులు హామీ ఇచ్చారు.

# వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య

**మట్టి వినాయకుడిని పూజిస్తే.. మహా గణపతిని ఆరాధించినట్టే**

**వరంగల్,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**




వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య వినాయక చవితి పర్వదినం సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వినాయక చవితి స్ఫూర్తిగా అన్ని విఘ్నాలు తొలగిపోయి ప్రజలు సుఖసంతోషాలతో, అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం సుభిక్షంగా ఉండాలని, ప్రతి కార్యం నిర్విఘ్నంగా సఫలమవాలని ప్రార్థించారు. వినాయక మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, ముఖ్యంగా కరెంటు భద్రతపై శ్రద్ధ వహించాలని సూచించారు.

మట్టి వినాయకులనే ఆరాధిద్దాం

మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని ప్రజలకు ఎంపీ డాక్టర్ కడియం కావ్య విజ్ఞప్తి చేశారు. మట్టి వినాయకుడే మహా గణపతి అని పేర్కొన్నారు. భక్తి, శ్రద్ధలతో చేసే ఆరాధనే ముఖ్యమని, పెద్దవిగ్రహాల కన్నా పర్యావరణహితమైన మట్టి గణపతే శ్రేయస్కరమని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు చెరువులలో నిమజ్జనం చేస్తే నీటిలోని జీవరాశులకు తీవ్రమైన నష్టం కలుగుతుందని హెచ్చరించారు. మట్టితో చేసిన గణపతిని పూజించడం వలన పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతామని, ఆ విధంగా ప్రతి ఒక్కరూ పర్యావరణ రక్షకులుగా మారాలని పిలుపునిచ్చారు.

# మట్టి వినాయకులను పంపిణీ చేసిన కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి

**ఉప్పల్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**



వినాయక చవితి సందర్భంగా పర్యావరణ హితమైన మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఉప్పల్ కార్పొరేటర్ రజితపరమేశ్వర్ రెడ్డి స్వయంగా మట్టి గణపతులను పంపిణీ చేశారు.

గురువారం ఉప్పల్‌లోని వీటి కమాన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో రజితపరమేశ్వర్ రెడ్డి ప్రజలకు మట్టి గణపతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని, మట్టి గణపతుల వినియోగంతో నీటిలో కాలుష్యం తగ్గుతుందని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బాకారం లక్ష్మణ్, ఈగ ఆంజనేయులు ముదిరాజ్, తుమ్మల దేవి రెడ్డి, సల్ల ప్రభాకర్ రెడ్డి, మహంకాళి రాజు ముదిరాజ్, మాశెట్టి రాగవేందర్ గుప్తా, కాయ హనుమంత్, బోడిగా మల్లేష్ గౌడ్, తోకట రాజు, కావాలి రాము ముదిరాజ్, రంగుల్లా శేఖర్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణ హిత మట్టి వినాయకుల పంపిణీ కార్పొరేటర్ శాంతి సాయి జన్ శేకర్

**నాచారం, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**



వినాయక చవితి వేడుకల సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ నాచారం డివిజన్‌లో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రధాన అతిథిగా పాల్గొని స్థానిక ప్రజలకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.కార్యక్రమంలో కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ మాట్లాడుతూ, పర్యావరణ హిత మట్టి వినాయకుల వినియోగం ద్వారా నీటి కాలుష్యం తగ్గుతుందని, భవిష్యత్ తరాలకు ప్రకృతి సంపదను కాపాడటం మన అందరి బాధ్యత అని అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పాపి) విగ్రహాల వల్ల నదులు, చెరువులు కాలుష్యానికి గురవుతున్నందున అందరూ మట్టి విగ్రహాలను ఉపయోగించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

నాచారం డివిజన్‌లోని వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను స్వీకరించారు. చిన్నపిల్లలు కూడా తల్లిదండ్రులతో కలిసి వచ్చి మట్టి వినాయకులను తీసుకోవడంతో కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణ లభించింది. ఈ కార్యక్రమంలో బారాస నాయకులు సాయి జెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, రామచందర్, శ్రీను, సాయి దేవ్, యాక స్వామి తదితరులు పాల్గొని విజయవంతం చేశారు. స్థానిక ప్రజలు ఈ వినూత్న కార్యక్రమాన్ని అభినందించారు.

# ప్రధాన రహదారిపై గుంత ప్రమాదంలో కుటుంబానికి తీవ్ర గాయాలు

**తక్షణ చర్యతో గుంత పూడ్చిన మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి**

**నాగారం, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)**

నాగారం బండ్లగూడ ప్రధాన రహదారిపై సబ్ స్టేషన్ ఎదురుగా ఏర్పడిన లోతైన గుంత ప్రమాదానికి దారితీసింది. నిన్న రాత్రి ఒక కుటుంబం బైక్ పై ప్రయాణిస్తుండగా ఆ గుంతలో జారి పడటంతో వారికి తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ ఘటన స్థానిక ప్రజల్లో ఆందోళన రేపింది. రహదారి పరిస్థితి బాగాలేదని పలువురు నివాసితులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చినా, సమస్య పరిష్కారం కాలేదు.ఈ ఘటన గురించి తెలిసిన వెంటనే నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి స్వయంగా ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ప్రమాదకరంగా మారిన ఆ గుంతలో తక్షణమే మట్టి నింపించి రహదారిని చదును చేయించారు. రహదారి పక్కన లైట్లు ఏర్పాటు చేయాలని, ట్రాఫిక్ సమస్యలను నివారించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆయన స్థానిక అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బిజా శ్రీనివాస్ గౌడ్, స్థానిక నాయకులు రామక్కపేట రవీందర్ రెడ్డి, బి. సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తక్షణ స్పందనతో



ప్రమాదకర గుంత పూడ్చడం పట్ల స్థానికులు మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డిని అభినందించారు.స్థానిక ప్రజలు మాట్లాడుతూ, "ప్రతి రోజూ వందలాది వాహనాలు ఈ రహదారిపై ప్రయాణిస్తున్నాయి. ఇటువంటి గుంతల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయి. అధికారులు క్రమం తప్పకుండా రహదారులను పరిశీలించి మరమ్మతులు చేయాలి" అని కోరారు.

# వినాయక చవితి ఉత్సవాలపై సమీక్షా సమావేశం



స్టేషన్ ఘనపూర్, ఆగస్టు/ 26 (తెలంగాణ ముచ్చట్లు)

స్టేషన్ ఘనపూర్ రెవెన్యూ డివిజనల్ అధికారి డి.ఎస్. వెంకన్న, జిల్లా పంచాయతీ అధికారి (జనగామ జిల్లా) స్వరూప రాణి మున్సిపల్ కమిషనర్ బి. రాధాకిషన్ ఆధ్వర్యంలో మంగళవారం రోజున ఆర్డీవో కార్యాలయంలో వినాయక చవితి ఉత్సవాల సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో వెంకన్న మాట్లాడుతూ -

"వినాయక చవితి ఉత్సవాలను ఎలాంటి శాంతిభద్రతలకు భంగం కలగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి. పోలీస్ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుని, ప్రతి మండలంలో భద్రతా ఏర్పాట్ల పై ప్రత్యేక దృష్టి పెట్టాలి" అని సూచించారు.


"పంచాయతీ పరిధిలో శుభ్రత, చెత్త నిర్వహణ, తాగునీటి సరఫరా వంటి పనులను సమయానికి పూర్తి చేయాలి. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు పడకుండా అధికారులంతా క్రమపద్ధతిగా పని చేయాలి" అని అన్నారు. పట్టణ పరిధిలో గణేశ్ మండపాల వద్ద విద్యుత్, లైటింగ్, శుభ్రత వంటి సౌకర్యాలను సమకూరుస్తాం. మున్సిపల్ సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు.

సమావేశంలో డివిజన్ పరిధిలోని సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, అన్ని మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ సిబ్బంది, నీటి పారుదల శాఖ డీఈ తదితర అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న అధికారులు వినాయక చవితి సందర్భంగా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి, ప్రజలు ఉత్సవాలను సాఫీగా జరుపుకునేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు.

# ఉప్పల్ పిహెచ్సి సూపర్వైజర్ భోగ ప్రకాష్ సేవలు అభినందనీయం

## బన్నాల ప్రవీణ్ ముదిరాజ్



ఉప్పల్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)

ఉప్పల్ పిహెచ్సి సూపర్వైజర్‌గావిశిష్టమైన సేవలు అందించిన భోగ ప్రకాష్ పదోన్నతి పై ఎక్స్టెన్షన్ ఆఫీసరుగా బదిలీ అవుతుండటంతో నిర్వహించిన వీడ్కోలు సభలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,ఉప్పల్ పిహెచ్సి అంటే భోగ ప్రకాష్ అనే ప్రత్యేక గుర్తింపు. పార్టీలకు అతీతంగా అందరికీ సమానంగా అందించిన సేవలు ప్రశంసనీయమైనవి. ఆయన కృషితో ఉప్పల్ పిహెచ్సి అనేక అవార్డులు సాధించింది. సహచరులకు స్ఫూర్తి కలిగించే వ్యక్తి. మళ్ళీ బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉప్పల్‌కే రప్పిస్తాం అని తెలిపారు.

ఈ కార్యక్రమంలో వైద్య అధికారి సౌసల్యారాణి, పిహెచ్సి సిబ్బంది, స్థానిక నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. భోగ ప్రకాష్, గొంగిడయ్యలను శాలువాలతో సత్కరించారు.

# గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకం...

## జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ కళావతి బాయి

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)



గర్భస్థ లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ బి. కళావతి బాయి అన్నారు.

కలెక్టరేట్ లోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి కార్యాలయంలో మంగళవారం గర్భస్థ పూర్వ, గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం పరిధి జిల్లా అడ్వైజరి కమిటి సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్న స్కానింగ్ కేంద్రాలలో జరిగే ప్రతి స్కానింగ్ కు సంబంధించి ఫారం ఎఫ్ రూపొందించి ఆన్ లైన్ లో నమోదు చేయాల్సి ఉంటుందని అన్నారు. ఖమ్మం జిల్లాలో జరిగే ప్రసవాలలో వెయ్యి మంది మగ పిల్లలకు 988 మంది ఆడ పిల్లలు జన్మిస్తున్నారని, గర్భస్థ శిశువుగా ఉన్నప్పుడు స్త్రీ, పురుష లింగ నిర్ధారణ పరీక్షలు చేసినట్లయితే పరీక్షలు చేసిన వారికి, చేయించుకున్న వారికి, అందుకు ప్రోత్సహించిన వారికి చట్టప్రకారం మూడు సంవత్సరాల వరకు జైలు శిక్ష, పది వేలు జరిమాన విధించబడుతుందని,అలాగే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

లింగ నిర్ధారణ అరికట్టుటకు ప్రతి నెల స్కానింగ్ సెంటర్లను కార్యాలయ సిబ్బంది, బృందంతో తనిఖీ నిర్వస్తున్నామని అన్నారు. జిల్లాలోని ఆసుపత్రులలో జరుగుతున్న అబార్షన్ కేసులను సైతం స్టడీ చేసి ఎక్కడైనా లింగ నిర్ధారణ కారణంగా అబార్షన్ జరిగిందా అని పరిశీలించాలని డిఎంహెచ్ఓ తెలిపారు. అధికంగా అబార్షన్ జరిగే ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులకు లింగ నిర్ధారణ చేయకుండా ఉండే విధంగా చట్టం పై పూర్తి అవగాహన కల్పించాలని, లింగ నిష్పత్తి సమానమయ్యే దిశగా కృషి చేయాలని, ఏ స్కానింగ్ కేంద్రంలో అధికంగా స్కానింగ్‌లు అవుతున్నాయో పరిశీలించి ఆకస్మిక తనిఖీలు చేయాలని అన్నారు.

జిల్లా సంక్షేమ శాఖ ద్వారా ప్రజల్లో ఆడపిల్ల అదృష్టమనే అవగాహనతో పాటు ప్రజల్లో చైతన్యం తేవాలన్నారు. పోస్టర్లు, కరపత్రాల ద్వారా చట్టం పై అవగాహన, ఆడపిల్లలు మగపిల్లలతో సమానమేనని, అవకాశం ఇస్తే అన్ని రంగాల్లో రాణిస్తారనే విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. గర్భిణీ లపై అంగన్వాడీ, ఆశా లు ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఎక్కువగా 5, 6 వ నెలల్లో అబార్షన్ లకు అవకాశం ఉంటుందని, వీరు పరీక్షలకు వచ్చేలా ఫాలో అప్ చేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి కె. రాంగోపాల్ రెడ్డి, డిసిహెచ్ఎస్ డా. రాజశేఖర్, పీవో ఎంసిహెచ్ డా. చందు నాయక్, పీవో ఎన్సివి డా. పి. వెంకట రమణ, ఏడి కె. శ్రీనివాసరావు, డిఎంసి ఎస్డీ. సమ్రీన్, జాగృతి ఎన్జిఓ ఎం. కుముదిని, అధికారులు, తదితరులు పాల్గోన్నారు.

# సత్యనారాయణ కాలనీలో 500 మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమం ఘనంగా



నాగారం, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)

వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని నాగారం మున్సిపాలిటీ పరిధిలోని సత్యనారాయణ కాలనీ రోడ్ నెంబర్ 1 వద్ద ఘనంగా 500 మట్టి వినాయక విగ్రహాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. పర్యావరణహితమైన గణపతుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ కాలనీ వాసుల కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్ర రెడ్డి మాట్లాడుతూ, "మట్టి గణపతులను ఇంటికి తీసుకెళ్లి పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత" అని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు అనంత రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, యువజన నాయకుడు రాహుల్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సత్యనారాయణ కాలనీ ప్రెసిడెంట్ మధుసూదన్ రెడ్డి, రవీందర్ రెడ్డి, రాజశేఖర్, నాగరాజు, త్యాగరాజు తదితర నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

కార్యక్రమం సందర్భంగా స్థానిక నాయకులు, యువత పెద్ద ఎత్తున పాల్గొని వినాయక విగ్రహాలను కాలనీ వాసులకు అందజేశారు. ఈ సందర్భంగా కాలనీ పిల్లలు, మహిళలు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతుల పంపిణీ కాంగ్రెస్ నాయకుల పిలుపు

నాచారం, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)

వినాయక చవితి సందర్భంగా పర్యావరణహితమైన మట్టి గణపతుల వినియోగాన్ని ప్రోత్సహిస్తూ, నాచారంలోని శ్రీ మహాకాళి సహిత మహా కాలేశ్వర స్వామి దేవస్థానం వద్ద మట్టి గణపతుల పంపిణీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎస్ఎస్ఎస్ యువసేన ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ సైనికుడు సంతోష్ రెడ్డి ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మట్టి గణపతులను ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ:పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత. రసాయనాలతో తయారయ్యే విగ్రహాలు జల వనరులను, పర్యావరణాన్ని కలుషితం చేస్తున్నాయి. అందుకే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నియోజకవర్గం వ్యాప్తంగా మట్టి గణపతులను పంపిణీ చేస్తున్నాం. ఈ సారి ప్రతి ఒక్కరు మట్టి గణపతులను పూజించి భవిష్యత్ తరాలకు హరిత భూమిని అందించాలి అని పిలుపునిచ్చారు. సంతోష్ రెడ్డి మాట్లాడుతూ.. వినాయక చవితి ఆనందోత్సవాలను ప్రజలు ఉత్సాహంగా జరుపుకుంటారు. కానీ పర్యావరణాన్ని హాని చేయకుండా సురక్షితంగా వేడుకలు జరుపుకోవాలి. మండపాల వద్ద భద్రతా చర్యలు తప్పనిసరిగా పాటించాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో యువసేన సభ్యులు రామకాంత్ లోకే, కిషోర్ రెడ్డి, విజయ్ కుమార్ సింగ్, మొహమ్మద్ జావీద్, సాయి ప్రసాద్, మహేష్ రెడ్డి, అలేటి శ్రీకాంత్, అక్షంత్, జ్యోషిత్ యాదవ్, సందీప్ జోని, సందీప్ కుమార్, రాహుల్, నరసింహ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్థానిక ప్రజలు మట్టి గణపతుల పంపిణీని అభినందిస్తూ, ఇలాంటి కార్యక్రమాలు పర్యావరణ అవగాహన పెంచుతాయి. ఈసారి మట్టి గణపతులనే ఇంటికి తీసుకెళ్లి పూజిస్తాం అని అన్నారు.

# రాష్ట్ర ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎంపీ నామ

ఖమ్మం బ్యూరో, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)



వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు రాష్ట్ర ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. విఘ్నాలను తొలగించి శుభఫలితాలను ప్రసాదించే విఘ్నేశ్వరుడి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నారు. మతసామరస్యాన్ని పెంపొందించే ఈ పండుగను అందరూ భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని, వినాయక చవితి పర్వదినం పర్యావరణహిత పండుగ కావాలని, మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్టించి పర్యావరణ సంరక్షణలో భాగస్వాములు కావాలని నామ పిలుపునిచ్చారు. వినాయకుడి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ప్రతి ఒక్కరి జీవితంలో సకల విజయాలు సాధించేందుకు గణనాయకుడి కృప లభించాలని నామ కోరుకున్నారు.



# సత్తుపల్లిలో మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ

సత్తుపల్లి, ఆగస్టు 26(తెలంగాణ ముచ్చట్లు):

సత్తుపల్లి పట్టణంలో గణేశ్ చతుర్థి పర్వదినాన్ని పురస్కరించుకొని గత ఎనిమిది సంవత్సరాలుగా కొనసాగుతున్న మట్టి గణపతి విగ్రహాల ఉచిత పంపిణీ కార్యక్రమం ఈ ఏడాది కూడా ఘనంగా జరిగింది. బీఆర్ఎస్ పార్టీ మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాధురి మెడికల్ అండ్ జ్యూస్ సెంటర్ ఆధ్వర్యంలో మొత్తం వెయ్యి మట్టి గణపతి విగ్రహాలను భక్తులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సండ్ర వెంకటవీరయ్య పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి గణపతి విగ్రహాల వినియోగం అత్యంత అవసరమని తెలిపారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలు పర్యావరణానికి హానికరం కావడంతో వాటికి బదులు మట్టి విగ్రహాలను ఉపయోగించడం ద్వారా భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించవచ్చని అన్నారు. గత ఎనిమిది సంవత్సరాలుగా సత్తుపల్లిలో జరుగుతున్న ఈ కార్యక్రమం ప్రజల్లో పర్యావరణ అవగాహన పెంచడంలో మంచి ఉదాహరణగా నిలుస్తోందని పేర్కొన్నారు. మాధురి మెడికల్ అండ్ జ్యూస్ సెంటర్ నిర్వాహకులు మాట్లాడుతూ ఇకపై ప్రతి ఇంటిలో పర్యావరణ హిత గణపతి విగ్రహాలే ఉండాలని తమ ఆకాంక్ష అని తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా భక్తుల ఆశీర్వాదాలతో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నామని, ఈసారి కూడా ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని మద్దతు ఇవ్వడం ఆనందంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, స్థానిక వ్యాపారవేత్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మట్టి గణపతిని స్వీకరించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి పట్టణం అంతటా ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది.



# కొత్తకోట మండల గౌడ సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నిక

## వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షులు పలుస శ్రీనివాస్ గౌడ్

కొత్తకోట,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):

వనపర్తి జిల్లా గౌడ సంఘం ఆధ్వర్యంలో కొత్తకోట మండల గౌడ సంఘం నూతన కమిటి ని మంగళవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని వనపర్తి జిల్లా అధ్యక్షులు పలుస శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ సందర్భంగా వనపర్తి జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు పలుస శ్రీనివాస్ గౌడ్, గౌరవ ఆధ్యక్షులు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్ గౌడ్,సలహాదారులు మాలపల్లి రామన్ గౌడ్, నరసింహ గౌడ్, మహదేవన్ గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీనీ ఎన్నుకోవడం జరిగిందని అన్నారు. నూతన కమిటీ సభ్యులను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన కమిటీ పదవులు

అధ్యక్షుడు: నాటెలి కృష్ణయ్య గౌడ్,ఉపాధ్యక్షులు ఆనంద్ గౌడ్ (రాయినిపేట), పాలెం వెంకటయ్య గౌడ్,ప్రధాన కార్యదర్శి నరసింహ గౌడ్,కోశాధికారి ఇట్టే భాస్కర్ గౌడ్(దంతానూర్),గౌరవాధ్యక్షుడు గుండ్రాతి శ్రీనివాస్ గౌడ్ (ముమ్మలపల్లి),

గౌరవ సలహాదారులు రవీందర్ గౌడ్ (కానయపల్లి),ఆర్గనైజింగ్ సెక్రటరీలు జీవన్ గౌడ్(మీరాసిపల్లి),మధుసూదన్ గౌడ్(సంకిరెడ్డిపల్లి),వర్కింగ్ ప్రెసిడెంట్ అక్కి రాఘవేందర్ గౌడ్(పామాపురం), జాయింట్ సెక్రటరీలు నరేందర్ గౌడ్ (నిర్వెన్), చర్లపల్లి నరేంద్ర గౌడ్, చిన్న అంపన్న గౌడ్ (వడ్డేవాటా),యువజన విభాగం యూత్ ప్రెసిడెంట్ పుల్లయ్య గౌడ్ (ముమ్మలపల్లి), ఉపాధ్యక్షుడు దిలీప్ కుమార్ గౌడ్,ప్రధాన కార్యదర్శి దేవేందర్ గౌడ్,వర్కింగ్ ప్రెసిడెంట్ రామన్ గౌడ్ (కానయపల్లి),జాయింట్ సెక్రటరీ మోహన్ గౌడ్,ఎన్నికైన కొత్త కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందజేసి,శాలువాలతో సన్మానం చేశారు. అనంతరం జిల్లా నాయకులు నూతన కమిటీకి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల స్థాయి గౌడ సంఘం నాయకులు,పెద్దలు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చెల్లని చెక్కుతో ఉపాధ్యాయునికి జైలు

## పరిహారం చెల్లించాలంటూ కోర్టు తీర్పు.

సత్తుపల్లి, ఆగస్ట్ 26(తెలంగాణ ముచ్చట్లు):

చెల్లని చెక్కు కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయుడు జైలుపాలు అయ్యాడు. ఆరు నెలల జైలు శిక్షతో పాటు భాదితునికి తొమ్మిది లక్షల రూపాయలు, ప్రభుత్వానికి పది వేల రూపాయలు చెల్లించాలంటూ సత్తుపల్లి 6వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. శ్రీనివాసరావు మంగళవారం కీలక తీర్పు ఇచ్చారు.

వివరాల్లోకి వెళ్తే... కల్లూరు మండలం ముచ్చారం గ్రామానికి చెందిన ప్రైవేట్ లెక్చరర్ ముదిగొండ్ల రామనరసింహారావు, ఖమ్మంకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బూరుగు జయరాజు వద్ద 2015లో 8.50 లక్షలు అప్పుగా ఇచ్చాడు. ఆరు నెలల తర్వాత తిరిగి చెల్లించేందుకు 9.10 లక్షల చెక్కు ఇచ్చాడు. అయితే ఆ చెక్కు బౌన్స్ కావడంతో రామనరసింహారావు 2016 ఫిబ్రవరిలో సత్తుపల్లి ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కోర్టులో సీనియర్ న్యాయవాది పిన్నం జానకి రామారావు ద్వారా కేసు నమోదు చేశారు. సుదీర్ఘ విచారణ అనంతరం 2023 డిసెంబర్‌లో కింది కోర్టు, ప్రతివాదిపై ఆరు నెలల జైలు శిక్షతో పాటు 9.10 లక్షల రూపాయలు పరిహారం చెల్లించాలంటూ తీర్పు ఇచ్చింది. ఆ తీర్పుపై అప్పీల్ చేసిన జయరాజు, తాజాగా 6వ అదనపు జిల్లా కోర్టు ముందు విచారణ ఎదుర్కొన్నారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి శ్రీనివాసరావు, కింది కోర్టు తీర్పును సమర్థిస్తూ జయరాజుపై ఆరు నెలల జైలు శిక్షతో పాటు భాదితునికి తొమ్మిది లక్షలు, ప్రభుత్వానికి పది వేల రూపాయలు చెల్లించాలంటూ ఖరారు చేశారు. కేసులో మరోసారి విజయం సాధించిన సీనియర్ న్యాయవాది పిన్నం జానకి రామారావును పలువురు న్యాయవాదులు అభినందించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## భారతదేశంలో బ్రాహ్మణీయ మనువాద సంస్కృతి రాజ్యమేలుతోందని జి. రాములు వ్యాఖ్య

**ఏఎస్‌రావు నగర్, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)**

స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో మంగళవారం కమలానగర్ ఆఫీసులో "ప్రత్యామ్నాయ సంస్కృతి" మరియు "సాంస్కృతిక రంగంలో కర్తవ్యాలు" అంశాలపై స్టడీ సర్కిల్ జరిగింది. కార్యక్రమానికి స్ఫూర్తి గ్రూప్ బాధ్యులు గొడుగు యాదగిరిరావు అధ్యక్షత వహించగా, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షుడు జి. రాములు ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా జి. రాములు మాట్లాడుతూ, "భారతదేశంలో వేల సంవత్సరాలుగా బ్రాహ్మణీయ మనువాద సంస్కృతి రాజ్యమేలింది. అగ్రవర్ణాల ఆధిపత్యంలో ప్రజలు బానిసలుగా మగ్గిపోయారు. దీనికి వ్యతిరేకంగా చార్వాకులు, కణాధులు, నిరీశ్వరవాదులు, శాంక్యవాదులు, బౌద్ధులు సమాజ మార్పు కోసం పోరాడారు. బౌద్ధం విజ్ఞానానికి ప్రాధాన్యతనిచ్చిన మతంగా నిలిచింది. అయితే మనువాదులు దానిని నిర్వీర్యం చేశారు" అని అన్నారు.

జ్యోతిరావు పూలే, సాహు మహారాజ్, నారాయణ గురు, అంబేద్కర్ వంటి మహనీయులు ప్రజాసంస్కృతిని ముందుకు తెచ్చారని తెలిపారు. "బ్రిటిష్ రాకపోతే మనువాదమే రాజ్యాంగంలా కొనసాగేది. స్వాతంత్ర్యానంతరం భారత రాజ్యాంగం సమానత్వాన్ని తెచ్చినా, మనువాదం ఇప్పటికీ దాదాపు 60% పైగా ప్రభావం చూపుతోంది. నేటి పాలకులు రాజ్యాంగాన్ని పక్కనబెట్టి మనువాదాన్ని తిరిగి తెచ్చే ప్రయత్నాలు చేస్తున్నారు" అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

సీనియర్ నాయకులు శ్రీమన్నారాయణ, జయరాజు, జి. శివరామకృష్ణ, రుక్కయ్య, శివన్నారాయణ, గిరీష్, శారద తదితరులు ప్రసంగించారు. స్ఫూర్తి గ్రూప్ సాంస్కృతిక రంగంలో చేస్తున్న కృషిని గొడుగు యాదగిరిరావు వివరించారు. కార్యక్రమంలో కోమటి రవి, ఎం. భాస్కర్‌రావు, సిహెచ్. నాగేశ్వరరావు, పుష్పరాజ్, భాస్కర్, గగన్ తదితరులు పాల్గొన్నారు.





## వినాయక నవరాత్రి ఉత్సావాలకు పటిష్టమైన బందోబస్త్..

### చోరీ కేసుల ఛేదనలో పురోగతి..
### పోలీస్ అధికారుల సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్..

**ఖమ్మం బ్యూరో, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు)**

వినాయక నవరాత్రి ఉత్సావాల సందర్భంగా ప్రజా భద్రతతో పాటు ప్రశాంత వాతావరణానికి భంగం కలగకుండా అధికారులందరు సమష్టిగా కృషిచేయాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అదేశించారు. పోలీస్ కాన్ఫిరెన్స్ హాలో మంగళవారం జరిగిన నేర సమీక్ష సమావేశంలో పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ...గణేశ్ విగ్రహాల ప్రతిష్ఠాపన మొదలు నిమజ్జనోత్సవం వరకు ఎక్కడ కూడా చిన్న పొరపాటుకు తావు లేకుండా ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అన్నారు. ముఖ్యంగా ఉత్సవాల్లో భక్తులకు, ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలకగకుండా విధిగా మండపాలను సందర్శించి నియమ నిబంధనలు పాటించేలా చూడాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే స్పందించడానికి సన్నద్ధమై ఉండాలని అన్నారు. విజుబుల్ పోలీసింగ్ కు తగిన ప్రాధాన్యతను ఇవ్వడంతో రాత్రివేళ్లలో పోలీస్ పెట్రోలింగ్ పెంచాలని అన్నారు.

పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగే నేరాలపై డివిజన్ స్థాయి అధికారులు విధిగా సమీక్షించాలని , ఛార్జ్ షీట్లను సకాలంలో దాఖలు చేయడం అలవారుచుకోవాలని పోలీసు అధికారలకు సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ లో నేరాల రేటు విశ్లేషణ, శిక్ష విధించే రేట్లను పెంచడం వంటి విషయాలపై అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.మహిళలపై, చిన్నారులపై జరిగే నేరాలు, మాదకద్రవ్యాల రవాణాను ఏమాత్రం సహించబోమని స్పష్టం చేశారు. ప్రధాన చోరీ కేసుల దర్యాప్తులో పురోగతి, మహిళలు, పిల్లలపై జరిగిన నేరాలు, వ్యవస్థీకృత నేర ముఠాలు మరియు మాదకద్రవ్యాల సంబంధిత నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆన్నారు.

రహదారుల్లో త్రిబుల్ రైడింగ్, మైనర్ డ్రైవింగ్ తో పాటు మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులను నమోదు చేసి న్యాయస్థానంలో శిక్షలు పడేలా పోలీసులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ లా&అర్డర్ ప్రసాద్ రావు,ఏసీపీలు రమణమూర్తి, తిరుపతి రెడ్డి, రహేమన్, రఘు, సాంబరాజు, మహేష్, సర్వర్, సత్యనారాయణ పాల్గొన్నారు.







## గణనాథుని ఆకారం విద్యార్థులకు స్ఫూర్తిదాయకం

### విశ్వశాంతి ప్లే స్కూల్లో వినాయక చవితి వేడుకలు

**సత్తుపల్లి, ఆగస్టు 26(తెలంగాణ ముచ్చట్లు):**

స్థానిక విశ్వశాంతి ప్లే స్కూల్లో మంగళవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు మట్టి గణపతి విగ్రహాలను స్వయంగా తయారు చేసి పూలమాలతో అలంకరించి పూజలు చేశారు. గణనాథునికి అంకితంగా పాటలు, నృత్యాలు చేసి సందడి చేశారు.పాఠశాల ప్రిన్సిపల్ పసుపులేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ గణనాథుని అవయవాలలో ప్రతిదీ విద్యార్థులకు ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుందని తెలిపారు. చిన్న కళ్ళు ఏకాగ్రతతో సూక్ష్మ దృష్టిని అలవరచుకోవాలని సూచిస్తాయి. దృఢమైన తొండము స్థిరత్వం, పట్టుదలను ప్రతిబింబిస్తుంది. వెడల్పైన చెవులు శ్రద్ధగా వినమని గుర్తు చేస్తాయి. చిన్న నోరు తక్కువగా మాట్లాడమని సూచిస్తుంది. ఈ లక్షణాలు విద్యార్థులకు జీవితాంతం స్ఫూర్తిదాయకమని ఆయన అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



## పెద్దమందడి మండలం మద్దిగట్ల గ్రామంలో బోనాల పండుగ వైభవంగా

**పెద్దమందడి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలంలోనిల మద్దిగట్ల గ్రామంలో బోనాల పండుగ మంగళవారం రంగరంగ వైభవంగా జరిగింది. మహిళలు ఎంతో ఉత్సాహం, భక్తిశ్రద్ధలతో పెద్దఎత్తున అమ్మవారికి బోనాలు సమర్పించి, నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద యూత్ సభ్యులు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లు ఆకట్టుకున్నాయి. డీజే, ఆటపాటలతో ఊరేగింపు జరగగా గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. పండుగలో గ్రామ పెద్దలు, స్వామి వివేకానంద యూత్ సభ్యులు, యువకులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని ఉత్సవాన్ని విజయవంతం చేశారు.







## ఆశా వర్కర్లకు రూ.18,000 ఫిక్స్డ్ వేతనం ప్రకటించాలంటూ ధర్నా

### పెన్షన్, గ్రాట్యుటీ, బీమా పథకాలు అమలు చేయాలని డిమాండ్

**మేడ్చల్-మల్కాజిగిరి, ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

ఆశా వర్కర్లకు నెలకు రూ!18,000 ఫిక్స్డ్ వేతనం ప్రకటించాలని, పని భద్రత కల్పించాలని, పెన్షన్, గ్రాట్యుటీ, బీమా పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.హేమలత నేతృత్వంలో ధర్నా నిర్వహించి అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు.

జిల్లా కార్యదర్శి ఎం.రేవతి కళ్యాణి మాట్లాడుతూ, "గతంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చింది. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు ఆ హామీలు అమలు కాలేదు. కనీస వేతనాలు, బీమా సదుపాయాలు, ప్రమోషన్లు, సెలవులు, విశ్రాంతి గదులు ఏర్పాటు వంటి అంశాలు తక్షణమే పరిష్కరించాలి" అని డిమాండ్ చేశారు.

సిఐటియు జిల్లా కోశాధికారి కే.ఉన్నికృష్ణ మాట్లాడుతూ, 2021 జూలైడిసెంబర్ పిఆర్సి ఏరియర్స్ చెల్లింపులు, రిటైర్మెంట్ ప్రయోజనాలు, వారాంతపు సెలవులు, మెడికల్ సెలవులు, యూనిఫార్ములు వంటి అంశాలపై వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని కోరారు. "ఆశా వర్కర్లపై ఉన్న పని ఒత్తిడి తగ్గించి, వారిని ఇతర పనులకు వినియోగించరాదు" అని స్పష్టం చేశారు.

ఆశా వర్కర్ల రక్షణ, డ్యూటీలకు వాహన సదుపాయాలు, సిబ్బంది ఏర్పాటు చేయాలని, లింగ వేధింపులు, అధికారుల వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. "తక్షణమే సమస్యలు పరిష్కరించకుంటే 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని చేపడతాం" అని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్, జిల్లా నాయకులు రాధా, కోమలత, వాసంతి, అనిత, సబియా, లత, పద్మ, లలిత, కవిత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మపల్లి గ్రామంలో ఘనంగా బోనాల పండుగ

**పెద్దమందడి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలంలోని అమ్మపల్లి గ్రామంలో మంగళవారం బోనాల పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో తలపై బోనాలు మోసుకొని ఊరేగింపుగా బయలుదేరారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి, బోనాలను సమర్పించారు. మహిళలు, యువతులు, చిన్నారులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో ఆరాధించారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. గ్రామ పెద్దలు మాట్లాడుతూ - బోనాల పండుగ మన సాంప్రదాయాలకు ప్రతీక. అమ్మవారిని ఆరాధించడం ద్వారా గ్రామంలో శాంతి, ఐకమత్యం నెలకొంటుంది" అని తెలిపారు.

పండుగలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, పిల్లలు పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకొని, కుటుంబ సుఖశాంతుల కోసం ప్రార్థనలు చేశారు.

## లక్కీ డ్రా ద్వారా గణేష్ మండపాలకు లడ్డూ పంపిణీ

### పద్మజ మొబైల్స్ ప్రత్యేక వినాయక చవితి కార్యక్రమం

**ఏఎస్ రావు నగర్, ఆగస్ట్ 26 (తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ కుషాయిగూడలోని పద్మజ మొబైల్స్ వినాయక చవితి సందర్భంగా ప్రత్యేకమైన సేవా కార్యక్రమాన్ని చేపట్టింది. కాప్రా మున్సిపాలిటీ పరిధిలోని 20 గణేష్ మండపాలను ఎంపిక చేసి లక్కీ డ్రా ద్వారా ఉచితంగా లడ్డూలను పంపిణీ చేసింది.గణనాథుడి పూజల్లో ప్రతి సంవత్సరం ఉత్సాహం అప్రతిహతం. ఈ సాంప్రదాయ ఉత్సవంలో భాగంగా మా తరపున చిన్న బహుమతిగా లడ్డూలను పంచడం ఆనందంగా ఉంది" అని పద్మజ మొబైల్స్ ప్రతినిధి వీరేష్ తెలిపారు.



ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ శిరీష సోమశేఖర్ రెడ్డి హాజరై పద్మజ మొబైల్స్ చేపట్టిన సేవా కార్యక్రమాన్ని ప్రశంసించారు. హైలైట్ పాయింట్స్: వినాయక చవితి సందర్భంగా లక్కీ డ్రా ప్రత్యేకం,20 గణేష్ మండపాలకు ఉచిత లడ్డూల పంపిణీ .పద్మజ మొబైల్స్ సేవకు ప్రజల ప్రశంసలు.



# ఆర్టీసీ బస్సులో చెలరేగిన మంటలు

- లింగంపల్లి నుంచి వస్తుండగా బస్టాండ్ వద్ద ఆగిపోయిన బస్సు
- స్టార్ట్ కాకపోవడంతో ప్రయాణికులను దించేసిన డ్రైవర్
- బాగుచేసే ప్రయత్నంలో ఒక్కసారిగా చెలరేగిన మంటలు
- డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన ప్రమాదం.. బస్సు ముందు భాగం పూర్తిగా దగ్ధం





**హైదరాబాద్, (తెలంగాణ ముచ్చట్లు):**

నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతమైన మెహిదీపట్నంలో మంగళవారం ఉదయం పెను ప్రమాదం తృటిలో తప్పింది. ప్రయాణికులతో వెళుతున్న ఓ ఆర్టీసీ సిటీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగి తీవ్ర కలకలం సృష్టించాయి. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రయాణికులందరూ సురక్షితంగా బయటపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడిరది. వివరాల్లోకి వెళితే.. మెహిదీపట్నం డిపోకు చెందిన సిటీ బస్సు లింగంపల్లి నుంచి ప్రయాణికులతో మెహిదీపట్నం బయలుదేరింది. బస్టాండ్ సమీపంలోకి రాగానే బస్సులో సాంకేతిక సమస్య తలెత్తి రోడ్డు మధ్యలోనే ఆగిపోయింది. డ్రైవర్ బస్సును తిరిగి స్టార్ట్ చేయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించి, ప్రయాణికులందరినీ వెంటనే బస్సు నుంచి కిందకు దించేశాడు. అనంతరం, సమస్యను పరిశీలించేందుకు డ్రైవర్ బానెట్‌ను తెరిచి వైర్లను సరిచేస్తుండగా ఒక్కసారిగా ఇంజిన్‌లోంచి దట్టమైన పొగతో పాటు మంటలు ఎగిసిపడ్డాయి. క్షణాల్లోనే మంటలు బస్సు ముందు భాగానికి వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే, వారు వచ్చేసరికే బస్సు ముందు భాగం పూర్తిగా కాలిపోయింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగి ఉండవచ్చని భావిస్తున్నారు. ప్రమాదానికి గల కచ్చితమైన కారణాలపై అధికారులు విచారణ జరుపుతున్నారు. ప్రయాణికులు కిందకు దిగిన తర్వాత మంటలు చెలరేగడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

# గణేష్ ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

## మండల కాంగ్రెస్ నాయకులు జగదీశ్వర్ రెడ్డి (బంగ్లా బాబు)



**పెద్దమందడి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**

వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జగదీశ్వర్ రెడ్డి (బంగ్లా బాబు) ప్రజలను కోరారు.
గణేష్ నవరాత్రుల సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో మాట్లాడుతూ... మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, షార్ట్ సర్క్యూట్లు జరగకుండా విద్యుత్ సరఫరాపై నిర్వాహకులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పారిశుధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అన్నారు.
మండపాల వద్ద చిన్నపిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడకుండా రాకపోకలకు తగిన దారి ఏర్పాట్లు చేయాలని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని మండప నిర్వాహకులను ఆయన కోరారు.
రాష్ట్ర ప్రజలతో పాటు వనపర్తి జిల్లా, పెద్దమందడి మండల పరిధిలోని అన్ని గ్రామాల ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ... వినాయకుడి ఆశీస్సులతో ప్రతి ఇంటా ఆనందం, శ్రేయస్సు, ఆరోగ్యం, ఐశ్వర్యం నెలకొనాలని కోరుకుంటున్నాను అని జగదీశ్వర్ రెడ్డి (బంగ్లా బాబు) పేర్కొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బుజ్జి గణనాథుని ప్రదర్శన



**ఎర్రవల్లి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**

ఎర్రవల్లి శ్రీ సరస్వతి ఇంటర్నేషనల్ సీబీఎస్ఈ స్కూల్ విద్యార్థులు వినూత్నంగా బుజ్జి గణపయ్యను ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థులందరూ గణపయ్య ఆకారంలో కూర్చుని అబ్బురపరిచే రీతిలో ప్రదర్శన ఇచ్చారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పాఠశాల చైర్మన్ వీర గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి భారతీయుల ప్రధాన పండుగలలో ఒకటని, పార్వతి పరమేశ్వరుల కుమారుడైన గణనాథుడి పుట్టినరోజు సందర్భంగా జరుపుకుంటారని విద్యార్థులకు వివరించారు. బుజ్జి గణపయ్యను చూసి ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థులను అభినందించారు.అలాగే చిన్నారులు మట్టి వినాయకులను తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలనే అవగాహన కలిగించడం శ్లాఘనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సహకరించగా, చైర్మన్ రాష్ట్ర ప్రజలకు ముందస్తు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

# కళ్ళకు గంతలు కట్టి మట్టి వినాయక విగ్రహం రూపొందించిన హోతి బసవరాజ్

## గిన్నిస్ రికార్డు లక్ష్యంగా కుషాయిగూడ కళాకారుడి వినూత్న ప్రయోగం



**కుషాయిగూడ,ఆగస్టు 26 (తెలంగాణ ముచ్చట్లు):**

కళ అనేది కేవలం చేతివృత్తి కాదు, అది భక్తి, అంకితభావం కలిసిన సమ్మేళనం అని నిరూపించాడు కుషాయిగూడకు చెందిన ప్రతిభావంతుడు హోతి బసవరాజ్. ఎన్నో విశేష రికార్డులు సాధించిన ఆయన, ఇప్పుడు కళ్ళకు గంతలు కట్టి మట్టి వినాయక విగ్రహం రూపొందించి గిన్నిస్ బుక్‌లో పేరు నమోదు చేయాలని సంకల్పించారు.

54 నిమిషాల్లో అద్భుత శిల్పం

చతుర్థి సందర్భంగా బసవరాజ్ కేవలం 54 నిమిషాల్లో మూడు అడుగుల ఎత్తైన మట్టి వినాయక విగ్రహాన్ని కళ్ళకు గంతలు కట్టి తీర్చిదిద్దారు. కేవలం స్పర్శ ఆధారంగా మట్టిని ఆకారం చెబుతూ వినాయకుడిని రూపుదిద్దడం ఆయన ప్రత్యేక శిల్పకళా నైపుణ్యానికి నిదర్శనం.

గత విజయాలు విశేషమే

ఇంతకుముందు పసుపుతో వినాయకుడిని రూపొందించి విశ్వగురు వరల్డ్ రికార్డు సాధించిన బసవరాజ్, వినూత్న ప్రయోగాలతో ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఈసారి మట్టితో విగ్రహాన్ని తయారు చేయడం ద్వారా పర్యావరణ పరిరక్షణ సందేశాన్ని అందిస్తున్నారు.

భక్తుల సందడి – ఆధ్యాత్మిక వాతావరణం

కుషాయిగూడలో ఈ వినాయకుడి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. భక్తి గీతాల నడుమ పూజలు, హోమాలు, అన్నదాన కార్యక్రమాలు జరుగుతుండగా, కుటుంబ సమేతంగా వచ్చిన ప్రజలు ప్రత్యేకతను చూసి ఆశ్చర్యపోతున్నారు.
చర్చనీయాంశంగా బసవరాజ్ ప్రతిభ
కళ్ళకు గంతలు కట్టి విగ్రహం తీర్చిదిద్దడం స్థానికంగా మాత్రమే కాకుండా తెలుగు రాష్ట్రాలు, దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోషల్ మీడియాలో ఆయన ప్రతిభపై ప్రశంసల వర్షం కురుస్తోంది. మట్టి వినాయకుడి రూపంలో సృజనాత్మకత, ఆధ్యాత్మికత కలగలిపిన ఈ ప్రయత్నం గిన్నిస్ రికార్డుల్లో నిలిచిపోతుందని అభిమానులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.


# పేటీఎం వ్యవస్థాపకుడి స్ఫూర్తిదాయక స్టోరీ



ఇంగ్లీష్ అంటే నేటి రోజుల్లో చాలామందికి భయం. ఎందుకంటే ఇంగ్లీష్ అనేది పరాయి భాష. పైగా ఆ భాషను వ్యక్తీకరించే విధానం కూడా వేరే విధంగా ఉంటుంది. అందువల్లే చాలామంది ఇంగ్లీష్ లో మాట్లాడాలంటే భయపడుతుంటారు. ఇంగ్లీష్ మీద పట్టు సాధించడానికి రకరకాల ఇనిస్టిట్యూట్ లకు వెళ్తుంటారు. ఇలాంటి అనుభవం మనలో చాలామందికి నిత్య జీవితంలో ఏదో ఒక సందర్భంలో ఎదురయ్యే ఉంటుంది. అయితే అలాంటివారు పేటీఎం వ్యవస్థాపకుడు స్టోరీ చదవాల్సిందే. ఇప్పుడంటే ఫోన్ పే, గూగుల్ పే, అమెజాన్ పే వంటివి అందుబాటులోకి వచ్చాయి. కానీ ఒకప్పుడు డిజిటల్ పేమెంట్స్ అంటే పేటీఎం మాత్రమే. ఆ పేటీఎం ను విజయ్ శేఖర్ అనే వ్యక్తి ఏర్పాటు చేశారు. పేటీఎం ద్వారా మనదేశంలో డిజిటల్ పేమెంట్లలో సంచలనం నమోదయింది. ఆ తర్వాత మిగతా కంపెనీలు కూడా ఈ విభాగంలోకి ప్రవేశించాయి. తద్వారా డిజిటల్ పేమెంట్లలో మన దేశం సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. పోటీ సంస్థలు ఎన్ని ఉన్నప్పటికీ పేటీఎం ఇప్పటివరకు తన చరిష్మాను తగ్గించుకోలేదు. పేటీఎం ఏర్పాటు చేసిన విజయ్ శేఖర్ ఉన్నత విద్యావంతుడు అయినప్పటికీ.. ఆంగ్లం అద్భుతంగా మాట్లాడే సామర్థ్యం ఉన్నప్పటికీ.. ఒకప్పుడు అతడు కూడా ఆటుపోట్లు ఎదుర్కొన్నాడు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే బయటపెట్టారు. విజయ్ శేఖర్ స్కూల్ లో చదువుకుంటున్నప్పుడు టాపర్ గా ఉండేవాడు. దీంతో అతడు ముందు వరుస బెంచీలో కూర్చునేవాడు. ఒకానొక సందర్భంలో ఆయన స్కూల్లో పనిచేయడానికి ఒక ఇంగ్లీష్ టీచర్ వచ్చారు.. ఆయన గొంతు తడుముకోకుండా ఇంగ్లీష్ అద్భుతంగా మాట్లాడారు. ఆయన మాట్లాడుతున్న తీరు చూసి విజయ్ శేఖర్ భయపడేవారు. ఎందుకంటే ఇంగ్లీష్ అంత గొప్పగా విజయ్ శేఖర్ కి వచ్చేది కాదు. దీంతో తనను టీచర్ ఏమైనా అంటారేమోనని భయంతో బ్యాక్ బెంచ్ కి విజయ్ శేఖర్ వెళ్లిపోయారు. ఇదే విషయాన్ని ఆయన ఒక కార్యక్రమంలో వెల్లడిరచారు.. ఇంగ్లీష్ అంటే భయం వద్దని.. ధైర్యంగా మాట్లాడాలని సూచించారు.. కేవలం ఇంగ్లీష్ విషయంలోనే కాదని.. మిగతా అన్నింటిలోనూ ఇదే ధైర్యాన్ని ప్రదర్శించాలని అప్పుడే జీవితంలో విజయవంతమవుతామని విజయ్ శేఖర్ పేర్కొన్నారు.. మొదట్లో పేటియం తాను ఏర్పాటు చేసినప్పుడు చాలామంది ఎగతాళి చేశారని.. ఇప్పుడు వారే నా ధైర్యాన్ని పొగుడుతున్నారని విజయ్ శేఖర్ వెల్లడిరచారు.

# దూకుడు పెంచిన యాపిల్ కంపెనీ..

ఇండియాలో యాపిల్ ఫోన్ల తయారీని నిలిపివేయాలని ఒక వైపు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నుంచి ఆ కంపెనీకి ఒత్తిడి వస్తున్నా.. యాపిల్ కంపెనీ మాత్రం భారత్‌లో తన కార్యకలాపాలను మరింత దూకుడుగా విస్తరిస్తోంది.తాజాగా మన దేశంలో నాలుగో స్టోర్‌ను ప్రారంభించనున్నట్లు యాపిల్ కంపెనీ తెలిపింది. భారత్‌లో తయారీ, విక్రయ కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్న యాపిల్ నాలుగో యాపిల్ స్టోర్‌ను ఏర్పాటుచేయనున్నట్లు మంగళవారం ప్రకటించింది.
మహారాష్ట్రలోని పుణెకు చెందిన కొరెగావ్ పార్క్‌లో సెప్టెంబర్ 4న దీనిని ప్రారంభించనుంది.అలాగే స్టోర్‌కు సంబంధించిన గ్రాఫిక్స్‌ను కూడా విడుదల చేసింది. బెంగళూరులోని స్టోర్ మాదిరిగానే పుణెలోని స్టోర్‌ను కూడా నెమలి కళాకృతితో తీర్చిదిద్దారు. ఈ స్టోర్ 10వేల చదరపు అడుగుల వైశాల్యంలో విస్తరించి ఉంటుందని సమాచారం. కొత్త ఐఫోన్ 17 లాంచ్ కానున్న నేపథ్యంలో ఈ ప్రారంభంపై ప్రకటన వచ్చింది. ఇప్పటికే ముంబయి, ఢిల్లీ, బెంగళూరులో స్టోర్లు ఉన్నాయి. భారత్‌లో వ్యాపార వృద్ధికి ఇంకా భారీ అవకాశాలున్నాయని గతంలో వ్యాఖ్యానించిన యాపిల్ సీఈఓ టిమ్‌కుక్.. అందుకు అనుగుణంగా దేశంలో నాలుగు రిటైల్ స్టోర్లు నెలకొల్పుతామని చెప్పిన సంగతి తెలిసిందే. త్వరలో విడుదల కాబోయే ఐఫోన్ 17 మోడళ్లన్నింటినీ దేశంలోనే తయారుచేయాలని యాపిల్ కంపెనీ నిర్ణయించింది. చైనా మీద ఆధారపడడాన్ని తగ్గించి, అమెరికాకు ఎగుమతులపై టారిఫ్ రిస్క్‌లను తప్పించుకోవడానికి యాపిల్ ఈ వ్యూహాత్మక ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే భారత్ నుంచి అమెరికాకు ఐఫోన్ ఎగుమతులు గణనీయంగా పెరిగాయి. యాపిల్ రాబోయే అన్ని ఐఫోన్ 17 మోడళ్లను భారత్‌లోని ఐదు ప్లాంట్లలో చేపట్టనుంది.




# తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బోనాల పండుగ



**పెద్దమందడి,ఆగస్టు26(తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. గ్రామ మహిళలు సంప్రదాయ బద్ధంగా ఊరేగింపుగా బయలుదేరి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలోని భక్తులు అమ్మవారిని పూజించి, గ్రామ ప్రజలు అష్టారోగ్యాలతో సుఖసంతోషాలతో మెలగాలని, పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థనలు చేశారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు, గ్రామస్తులు అందరూ ఉత్సాహంగా పాల్గొని, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా వేడుకను జరిపారు.

# 18 నెలల కనిష్టానికి చమురు దిగుమతులు



భారతదేశ చమురు దిగుమతులు 18 నెలల కనిష్ఠానికి పడిపోయాయి. ఈ ఏడాది జులైలో 1.85 కోట్ల మెట్రిక్ టన్నుల చమురు దిగుమతి జరిగింది. ఇంతక్రితం నెల దిగుమతులతో పోల్చితే 8.7 శాతం తగ్గడం ద్వారా.. ఫిబ్రవరి 2024 కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు చేసుకోవడం వల్లే భారత్‌పై అదనంగా 25 శాతం టారిఫ్‌లు వేస్తున్నామని ఇటీవల ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే అమెరికా ఆంక్షల మేరకే కేంద్రం చమురు దిగుమతిని తగ్గించి ఉంటుందనే అనుమానాలు తలెత్తుతున్నాయి. కాగా.. దేశీయ రిఫైనరీలలో నిర్వహణ కోసం షట్‌డౌన్‌లు, డిమాండ్‌లో సీజనల్ మందగమనం, గ్లోబల్ ఆయిల్ ధరలలో హెచ్చుతగ్గులు దిగుమతులకు ప్రధాన కారణమని ప్రభుత్వ వర్గాలు వెల్లడిరచాయి. గడిచిన జులైలో రష్యా నుంచి దిగుమతులు భారీగా తగ్గాయి. సౌదీ అరేబియా, ఇరాక్ నుంచి సరఫరా స్థిరంగా ఉంది. దేశీయ ఇంధన డిమాండ్‌లో కూడా స్వల్ప తగ్గుదల కనిపించింది. ముఖ్యంగా డీజిల్, పెట్రోల్ వినియోగంలో ఈ పరిస్థితి భారతదేశ ఆర్థిక వ్యవస్థపై స్వల్ప ప్రభావం చూపవచ్చని నిపుణులు భావిస్తున్నారు.

# ప్రియుడి మోజులో భర్తను చంపేసిన భార్య

(మొదటి పేజీ తరువాయి)

నాగలక్ష్మికి మహేశ్ అనే వ్యక్తితో కొంత కాలంగా వివాహేతర సంబంధం ఉంది. తమకు భర్త అడ్డుగా ఉన్నాడని భావించిన నాగలక్ష్మి అతడిని అంతమొందించాలని నిర్ణయించుకుంది. మంగళవారం మహేశ్‌ను ఇంటికి పిలిపించి, హరిచరణ్‌ను బంధించి దిండుతో ఊపిరాడకుండా చేసి హత్య చేశారు. అనంతరం, హరిచరణ్ బాత్రూంలో మూర్ఛ కారణంగా చనిపోయాడని అందరినీ నమ్మించే ప్రయత్నం చేసింది. మూడు రోజుల తర్వాత వారి కుమారుడు గల్ఫ్ నుంచి తిరిగి వచ్చాడు. తాను రాకముందే తండ్రి అంత్యక్రియలు జరపడంపై అనుమానం వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తల్లి ప్రవర్తనపై అనుమానం రావడంతో కుమారుడు పోలీసులను ఆశ్రయించాడు. నాగలక్ష్మిని, మహేశ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారించగా, వారు నేరాన్ని అంగీకరించారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## బాల్టిమోర్‌కు నేషనల్ గార్డు దళాలు

డెమోక్రాట్ల ఆధీనంలో ఉన్న నగరాలే టార్గెట్‌గా అక్రమవలసలు, నేరాల అదుపు పేరుతో నేరాల గార్డు దళాల మోహరింపు చర్యలను అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కొనసాగిస్తున్నారు. ఈ మేరకు దళాలను మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్ సిటీకి కూడా విస్తరిస్తానని హెచ్చరికలు పంపాడు. వాస్తవానికి బాల్టిమోర్ వాస్తవానికి డెమోక్రాట్లకు కంచుకోట. అయితే ఇక్కడ నేరాలు అదుపుతప్పాయని ఓ రిపబ్లికన్ నాయకుడు సోషల్ మీడియాలో ఫిర్యాదు చేశాడు. అలాగే మేరీల్యాండ్ గవర్నర్ వెస్ మూరేతో పాటు పలువురు డెమోక్రాటిక్ లీడర్లు డోనాల్ ట్రంప్ అనుసరిస్తున్న వివాదాస్పద విధానాలు, తీసుకుంటున్న నిర్ణయాలపై బహిరంగంగానే విమర్శలు చేస్తున్నారు. ట్రంప్, వెస్ మూరే మధ్య మాటల యుద్ధమే నడిచింది. ఈ నేపథ్యంలో జాతీయ భద్రతా దళాలను బాల్టిమోర్‌లోనూ మోహరింపచేస్తానని ట్రంప్ బెదిరింపులకు దిగటం గమనార్హం. ఈ నెల ప్రారంభంలో కూడా వాషింగ్టన్ వీధులను జాతీయ భద్రతా దళాలు మోహరించాయి. దీంతో ఆ సమయంలో ట్రంప్ నిర్ణయంపై తీవ్ర విమర్శలు వచ్చాయి. తాజాగా ఇప్పుడు బాల్టిమోర్‌లోనూ జాతీయ భద్రతా దళాలను ట్రంప్ హెచ్చరికలు జారీ చేయటం గమనార్హం. నేషనల్ గార్డ్ ఆదివారం నుంచి వాషింగ్టన్‌లో ఆయుధాలను తీసుకెళ్లడం ప్రారంభించిందని సైన్యం తెలిపింది. అక్రమవలసలపై తాను తీసుకుంటున్న చర్యలకు వ్యతిరేకంగా జరుగుతోన్న నిరసనలను అణచివేయడానికి లాస్‌ఏంజిల్స్‌కు దాదాపు 5వేల మంది సైనికులను తరలించాలంటూ ట్రంప్ ఈ ఏడాది జూన్‌లో వివాదాస్పద నిర్ణయం తీసుకున్నారు. ఈ చర్యను కాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ తీవ్రంగా వ్యతిరేకించారు. గవిన్ న్యూసమ్ 2028లో అధ్యక్ష పదవికి పోటీ చేయాలని చూస్తున్నారు. ఇక దేశంలోనే మూడో అతిపెద్ద నగరమైన చికాగోకు వేల మంది నేషనల్ గార్డ్ దళాలలను మోహరించాలని ట్రంప్ యంత్రాంగం యోచిస్తున్నదని అమెరికా మీడియా నివేదిస్తున్నది. డెమోక్రాటిక్ నేతృత్వంలోని ప్రధాన నగరాలైన చికాగో, న్యూయార్క్‌లలో వాషింగ్టన్ మాదిరిగానే నేషనల్ గార్డ్ మోహరింపులు ఉంటాయని ట్రంప్ గత శుక్రవారమే తెలిపారు. దీంతో ఈ విషయంలో అక్కడి డెమోక్రాట్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తున్నది.

## తప్పుడు ఆరోపణలు చేస్తారా?



యూదుల సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణ విషయంలో తనపై తప్పుడు ఆరోపణలు చేసిన అమెరికా రాయబారి ఛార్లెస్ కుష్‌నర్‌ను ఫ్రాన్స్ విదేశాంగ శాఖ తన కార్యాలయానికి పిలిపించింది. యూదు వ్యతిరేక హింసను అడ్డుకునే విషయంలో ఫ్రాన్స్ తగిన చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తూ దేశాధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్‌కు కుష్‌నర్ ఓ లేఖ రాశారు. దీనిపై ఆగ్రహించిన విదేశాంగ శాఖ ఆయనను పిలిపించి తన అభ్యంతరాన్ని తెలియజేసింది. వాల్ స్ట్రీట్ జర్నల్ పత్రికకు రాసిన ఓ బహిరంగ లేఖలో ఇజ్రాయిల్‌పై ఫ్రాన్స్ చేస్తున్న విమర్శలను కుష్‌నర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'ఇజ్రాయిల్‌పై ఆరోపణలు సంధిస్తూ, పాలస్తీనాను గుర్తించే దిశగా ఇస్తున్న సంకేతాలు ఇవ్వడం ఫ్రాన్స్‌లో నివసిస్తున్న యూదులకు ముప్పు కలిగిస్తాయి. తీవ్రవాదులకు ఊతమిస్తాయి. హింసను పెంచుతాయి' అని ఆయన ఆ లేఖలో రాశారు. దీనిపై ఫ్రాన్స్ వెంటనే స్పందించింది. కుష్‌నర్ ఆరోపణలను తోసిపుచ్చింది. ఓ రాయబారి నుంచి ఇలాంటి ఆరోపణలు రావడం ఆమోదయోగ్యం కాదని తెలిపింది. యూదు వ్యతిరేకతపై పోరాడే విషయంలో ఫ్రాన్స్ చిత్తశుద్ధితో ఉన్నదని స్పష్టం చేసింది. కుష్‌నర్ వ్యాఖ్యలు అంతర్జాతీయ చట్టానికి విరుద్ధంగా ఉన్నాయని, ముఖ్యంగా ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో తలదూర్చ రాదన్న సూత్రాన్ని ఉల్లంఘిస్తున్నాయని మండిపడిరది. కాగా కుష్‌నర్ చేసిన వ్యాఖ్యలను అమెరికా విదేశాంగ శాఖ సమర్థించింది. ఆయన ఫ్రాన్స్‌లో అమెరికా ప్రభుత్వ ప్రతినిధిగా వ్యవహరిస్తున్నారని, తమ దేశ ప్రయోజనాల పరిరక్షణలో గొప్ప కృషి చేస్తున్నారని వెనకేసుకొచ్చింది. కుష్‌నర్‌కు ఎంతో 'ఘనమైన' చరిత్ర ఉంది. పన్ను ఎగవేత, సాక్ష్యాలను తారుమారు చేయడం, మోసం వంటి ఆరోపణలపై ఆయన అమెరికా జైలులో రెండు సంవత్సరాలు శిక్ష అనుభవించారు. ఆ తర్వాత ఆయనకు దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ క్షమాభిక్ష ప్రసాదించారు. ఫ్రాన్స్‌లో అమెరికా రాయబారిగా విధులు చేపట్టి నెల రోజులు మాత్రమే అయింది. పాలస్తీనియన్లపై ఇజ్రాయిల్ సాగిస్తున్న దురాగతాల నుంచి అంతర్జాతీయ సమాజం దృష్టి మళ్లించడానికి, సమస్యపై చర్చను పక్కదారి పట్టించడానికి ఇజ్రాయిల్ మద్దతుదారులు తరచుగా ప్రత్యర్థులపై యూదు వ్యతిరేక ఆరోపణలు చేస్తుంటారు.

## అనారోగ్య కారణాలతోనే ధన్కర్ రిజైన్

న్యూ : భారత ఉపరాష్ట్రపతిగా జగదీప్ ధన్కర్ రాజీనామాకు ఆయన వ్యక్తిగత అనారోగ్య సమస్యలే కారణమని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. ఈ విషయాన్ని ఇంకా సాగదీయొద్దని చెప్పారు. దీనిపై చర్చను ఇక్కడితో ముగించాలని తెలిపారు. ఓ వార్త సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పలు అంశాలపై మాట్లాడిన ఆయన జగదీప్ ధన్కర్ రాజీనామా వ్యవహారం పైనా చర్చించారు. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేస్తున్నానన్న విషయాన్నీ ధన్కర్ సైతం తన రాజీనామా లేఖలో స్పష్టం చేశారని అమిత్ షా గుర్తు చేశారు. ఉపరాష్ట్రపతిగా ధన్కర్ తన పదవీ కాలంలో రాజ్యాంగం ప్రకారం విధులను చక్కగా నిర్వర్తించారని చెప్పారు. ఈ ఏడాది పార్లమెంటు వర్షాకాల సమావేశాల మొదటి రోజే జగదీప్ ధన్కర్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అనారోగ్య కారణాలతోనే రిజైన్ చేస్తున్నట్టు ఆయన చెప్పారు. వాస్తవానికి ధన్కర్ పదవీ కాలంలో మరో రెండేండ్లు ఉండగానే ఈ నిర్ణయం తీసుకోవటం పట్లా రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చ నడిచింది. పార్లమెంటు వర్షకాల సమావేశాల్లో జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన తీర్మానం విషయంలో.. రాజ్యసభ చైర్మెన్‌గా ఉన్న ఆయన కాంగ్రెస్ ఇచ్చిన తీర్మానాన్ని ఆమోదించారు. అయితే ఈ పరిణామం బీజేపీ అధిష్టానానికి, ముఖ్యంగా మోడీషా ద్వయానికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించిందనీ, ఇదే ధన్కర్ రాజీనామాకు కారణమైందని రాజకీయ వర్గాల్లో చర్చలు జరిగాయి. కాగా ధన్కర్ రాజీనామాతో ఖాళీ అయిన ఉపరాష్ట్రపతి స్థానానికి వచ్చేనెల 9న ఎన్నిక జరగనున్న విషయం విదితమే. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ అభ్యర్థిగా సి.పి రాధాకృష్ణన్, ఇండియా బ్లాక్ క్యాండిడేట్‌గా సుప్రీంకోర్టు మాజీ జడ్జి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డిలు బరిలో ఉన్నారు.

# సుంకాలు సంకటమే



అహ్మదాబాద్: అమెరికా నుంచి భారత్‌పై 50 శాతం సుంకాల విధింపు ఆందోళనకరమే, మనపై ఆర్థిక ఒత్తిడి పెరుగుతుందని ప్రధాని నరేంద్ర మోడీ అంగీకరించారు. అయితే భయపడేది లేదు, మనం ఈ పరిస్థితిని ధైర్యంగానే భరించి ఎదుర్కొంటామని ప్రధాని మోడీ సోమవారం గుజరాత్‌లో చెప్పారు. రెండు మూడు రోజులలో భారత్‌పై అమెరికా భారీ సుంకాల అమలు దశలో ఆయన తొలిసారిగా ట్రంప్ టారీఫ్‌ల పై స్పందించారు. పరిస్థితిని ఎదుర్కొనేందుకు మనం శక్తిని పుంజుకోవల్సి ఉందని చెప్పారు. ఇందుకు ఉన్న పలు మార్గాలను, మనం నమ్మాల్సిన స్వదేశీ, ఆత్మనిర్భరతలను మరింతగా పెంచుకోవల్సి ఉందని ప్రధాని చెప్పారు. మన కాళ్ల మీద మనం నిలబడే ఆత్మస్థయిర్యానికి ఈ గుజరాత్ నేల ఎంతో ప్రేరణ ఇచ్చిందని చెప్పిన మోడీ ఈ సందర్భంగా భగవానుడు శ్రీకృష్ణుడిని, మహాత్మా గాంధీని ప్రధానంగా ప్రస్తావించారు. అక్కడి నుంచి ఒత్తిడి నిజమే అయితే ఈ క్రమంలో మనం రాజీపడే ప్రసక్తే లేదని , మన రైతులు , చిన్న పరిశ్రమల వారు, పాడి రైతుల ప్రయోజనాల విషయంలో వెనుకంజ వేసేది లేదని స్పష్టం చేశారు. సాధ్యమైనంత త్వరలో పరిష్కారం కనుగోనడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పారు. గుజరాత్‌లో పలు బహుళస్థాయి ప్రాజెక్టుల ప్రారంభోత్సవానికి వచ్చిన సందర్భంగా ప్రధాని మాట్లాడారు. ఈ నెల 29 నుంచి ట్రంప్ వేసిన 50 శాతం సుంకాల అమలుకు రంగం సిద్ధం అయింది. ఇప్పుడు తలేత్తే విపరీత సుంకాల పరిస్థితిని మనం భరించాల్సి ఉంటుంది. గట్టెక్కే మార్గాలను అలవర్చుకోవల్సి ఉంటుంది. స్వదేశీ నినాదం మరింతగా ఇనుమడిరచాలి. అత్యధిక స్థాయిలో ఇక్కడి ఉత్పత్తుల వాడకానికి దిగాలి. భారత్ నిర్మిత సరుకులనే కొందాం అనే మంత్రంతో ముందుకు సాగాల్సి ఉందని ప్రధాని పిలుపు నిచ్చారు. ఇకనైనా వ్యాపారులు తమ దుకాణసముదాయాల ముందు తాము కేవలం స్వదేశీ సరుకులనే విక్రయిస్తామనే పెద్ద బోర్డులను పెట్టాల్సి ఉందని చెప్పారు. తనకు లక్షలాది మంది జనం ఆశీస్సులు, ప్రేమ ఆదరణలు ఉన్నాయని, ఇంతకంటే కావల్సిన దేమిటని ప్రశ్నించారు. ప్రధాని మోడీ రాక సందర్భంగా అహ్మదాబాద్‌లో సాయంత్రం పెద్ద ఎత్తున రోడ్‌షో సాగింది. దీనిపై ప్రధాని స్పందించారు.



## అమెరికాకు వ్యతిరేకంగా యునైటెడ్ నేషనల్ ఫ్రంట్

ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ కొన్ని కీలక వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌ను అమెరికా తన విధేయమైన దేశంగా మలుచుకోవాలనుకుంటున్నదని అన్నారు. ఇస్లామిక్ రిపబ్లిక్‌ను లొంగదీసుకోవడానికి అమెరికా చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టడం కోసం యునైటెడ్ నేషనల్ ఫ్రంట్‌కు ఆయన పిలుపునిచ్చారు. ఇజ్రాయిల్, అమెరికాతో యుద్ధ సమయంలో ఇరాన్‌లో ప్రభుత్వాన్ని అస్థిరపర్చే ప్రయత్నాలు జరిగాయని అన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ఖమేనీ అధికారిక వెబ్‌సైట్‌లో ప్రచురితమయ్యాయి. ఇరాన్, ఇజ్రాయిల్ యుద్ధం ఆగిపోయిన తర్వాత.. ప్రపంచదేశాలతో తన అణుకార్యక్రమం గురించి ఇరాన్ చర్చిస్తున్న తరుణంలో ఖమేనీ నుంచి ఈ వ్యాఖ్యలు రావటం ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. జూన్‌లో ఇరాన్‌పై ఇజ్రాయిల్, అమెరికా జరిపిన దాడులు ఇస్లామిక్ రిపబ్లిక్‌ను అస్థిరపర్చడానికి రూపొందించబడ్డాయని ఖమేనీ వాదించారు. యుద్ధం ప్రారంభంలో ఇరాన్‌పై ఇజ్రాయిల్ దాడి తర్వాత అమెరికా ఏజెంట్లు యూరప్‌లో సమావేశమయ్యారనీ, ఇస్లామిక్ రిపబ్లిక్ తర్వాత ఇరాన్‌ను ఎవరు పరిపాలించాలన్న దానిపై అందులో చర్చ జరిగినట్టు ఆయన చెప్పారు. మొత్తానికి యూఎస్.. ఇరాన్‌ను తాను చెప్పినట్టుగా చేసేలా మార్చుకోవాలని చూస్తున్నదని ఖమేనీ అన్నారు. ఇరాన్ దేశం తమ సాయుధ బలగాలు, ప్రభుత్వం, వ్యవస్థ వైపు నిలబడి శుత్రువులకు గట్టి దెబ్బ వేసిందని చెప్పారు. అంతర్గత విభజనలకు విదేశీ శక్తులు రెచ్చగొడుతున్నాయని కూడా ఆయన హెచ్చరించారు.



## వెనిజులా సరిహద్దుల్లో అమెరికా సైన్యం మోహరింపు

వెనుజులా సరిహద్దుల్లో అమెరికా తన సైన్యాన్ని మోహరించింది. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా నిరోదించడానికి 3 యుద్ధనౌకలు, 2 వేల మెరైన్‌లతో సహా 4 వేల మంది సైనికులు, ఒక అణు జలాంతర్గామి, నిఘా విమానాలు వెనుజులాకి సమీపంలోని కరేబియన్ సముద్రంలో సిద్ధంగా ఉన్నాయని అమెరికా బెదిరించింది.. దీనికి ప్రతిస్పందనగా వెనిజులా 45 లక్షల సభ్యులున్న జన రక్షక దళాన్ని (బొలివేరియన్ నేషనల్ మిలీషియా) పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసింది..ఈ చర్యను వెనుజులా అధ్యక్షుడు నికోలాస్ మాదురో ఖండిరచారు. ఇది అసంబద్ధమైన బెదిరింపుగా పేర్కొన్నారు. తమ అంతర్గత భద్రత రీత్యా జాతీయ ప్రతిఘటన దళాన్ని సిద్ధం చేస్తున్నామని తెలిపారు..అయితే మాదురోకు మాదక ద్రవ్యాలను అక్రమ రవాణా చేసే కార్టెల్ డి లాస్ సోల్స్‌తో సంబంధముందని అమెరికా ఆరోపించింది. ఈ నెల మొదటి వారంలో మదురోను పట్టిస్తే 5 మిలియన్ డాలర్లు (సుమారు 40 కోట్ల రూపాయలు) బహుమానాన్ని ఇస్తామని ప్రకటించింది..

''మత్తుమందు'' ఆరోపణల్లో వాస్తవమెంత ? అమెరికా ఆరోపణలకు విశ్వసనీయమైన రుజువులు లేవని అంతర్జాతీయ డేటా సూచిస్తోంది. అమెరికా డేటా సంస్థ యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్ ( యుఎన్ఒడిసి ) ప్రకారం ప్రపంచంలో మత్తుమందు ఉత్పత్తి , వ్యాపారం కొలంబియా, పెరూ, ఈక్వడార్ దేశాల్లో అధికం.. వెనిజులాలో మత్తుమందు ఉత్పత్తి కేంద్రాలు లేవు. కొలంబియన్ మత్తుమందులో కేవలం 5% మాత్రమే వెనిజులా ద్వారా రవాణా అవుతుందని యుఎన్ఒడిసి నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచంలో అత్యధికంగా మాదక ద్రవ్యాలను వినియోగించేది, డిమాండ్ చేసేదీ అమెరికానే. సరఫరా చేసేది మాత్రం దక్షిణ అమెరికాలోని దాని మిత్రదేశాలని వెనుజులా వర్గాలు విమర్శిస్తున్నాయి.

## నియంతను కాదు..తెలివైన వాడ్ని



నేను 'నియంత'ని కాదు, 'చాలా తెలివైన' వ్యక్తిని అని డోనాల్డ్ ట్రంప్ అన్నారు. భారత్, పాక్‌ల మధ్య అణు యుద్ధాన్ని ఆపానని పేర్కొన్నారు. సోమవారం వైట్ హౌస్‌లో విలేకరుల సమావేశంలో అనేక ముఖ్యమైన అంశాలపై మాట్లాడారు.ఇరాన్ అణు స్థావరాలపై బాంబు దాడి చేయడానికి విజయవంతమైన ఆపరేషన్ నిర్వహించానని, తన విధానాలు, నిర్ణయాలను సమర్థించుకున్నారు.''భారత్,పాక్‌ల మధ్య అణు యుద్ధం ఏర్పడే సమయంలో ఏడు జెట్ విమానాలు ధ్వంసమయ్యాయి. ఆ యుద్ధాన్ని ఆపడానికి వారికి కొన్ని గంటలు మాత్రమే ఉన్నాయి. నేను ఈ యుద్ధాన్ని ఆపాను. అని ట్రంప్ చెప్పారు.ఇరాన్ అణు స్థావరంపై బాంబు దాడి 'దోషరహిత ఆపరేషన్' అని ట్రంప్ అన్నారు. ఈ ఆపరేషన్‌లో 52 ట్యాంకర్లు, అనేక ఎఫ్22 , బీ2 బాంబర్లను ఉపయోగించారు. సుంకాల ద్వారా యుద్ధాలను ఆపానని ట్రంప్ అన్నారు. సుంకాల శక్తి ఎవరికీ తెలియదని ఆయన అన్నారు. ఈ విధానం నుంచి ట్రిలియన్ డాలర్ల ఆదాయం వస్తోంది. అని వివరించారు. రష్యాఉక్రెయిన్ యుద్ధంపై ట్రంప్ మాట్లాడుతూ, ''అమెరికా ఇకపై ఉక్రెయిన్‌పై ఎటువంటి డబ్బు ఖర్చు చేయదు. మేము ఉక్రెయిన్‌తో కాదు, నాటోతో వ్యవహరిస్తాము. మేము యుద్ధాన్ని ముగించాలనుకుంటున్నాం. ఈ విషయంలో వ్లాదిమిర్ పుతిన్‌తో మాట్లాడాం'' ''రష్యాఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపడం నాకు చాలా సులభం, కానీ ఇప్పుడు అది క్లిష్టంగా మారుతోంది.'' అని తెలిపారు. తాను అణ్వాయుధ నిరాయుధీకరణను కోరుకుంటున్నానని, అణు క్షిపణుల గురించి పుతిన్‌తో కూడా మాట్లాడానని చెప్పారు. ఉక్రెయిన్ భద్రతా హామీపై, దాని విధానాలను చర్చించలేదన్నారు. నాటోకు క్షిపణు లను ఇస్తామని, వాటిని ఉక్రెయిన్‌కు

## వరకట్న వేధింపులు.. ఓ లెక్చరర్ సజీవదహనం

**జోధ్‌పూర్: వరకట్న వేధింపులకు ఓ లెక్చరర్ మరణించింది.ఈ ఘోర విషాద ఘటన రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ జిల్లాలో చోటుచేసుకుంది. సంజు బిష్ణోయ్ అనే మహిళ జోధ్‌పూర్ జిల్లాలో లెక్చరర్‌గా పని చేస్తోంది. అయితే ఇంట్లో నిత్యం భర్త, అత్తమామలు వరకట్నం కోసం వేధిస్తున్నారు. ఈ వేధింపులు రోజురోజుకు మరింత తీవ్రం కావడంతో విసుగెత్తిపోయింది. దీంతో మూడేళ్ల కుమార్తె యశస్వితో కలిసి పెట్రోల్ పోసుకుని సజీవదహనం అయ్యారు. ఘటనాస్థలిలోనే కుమార్తె ప్రాణాలు వదలగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సంజు శనివారం మృతిచెందింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. ఒక సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. భర్త, అత్తమామల వేధింపుల కారణంగానే ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొంది. జోధ్‌పూర్ జిల్లాలోని ఫిట్కాస్నిగ్రామానికి చెందిన బాధిత మహిళా తల్లిదండ్రులు.. అల్లుడు దిలీప్ బిష్ణోయ్, అతని తల్లి, తండ్రిపై ఫిర్యాదు చేశారు. వారి వేధింపులు కారణంగానే ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. దీంతో భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ బృందం సహాయంతో పోలీసులు సంఘటనా స్థలం నుంచి ఆధారాలు సేకరించారు. సూసైడ్ నోట్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. సూసైడ్ నోట్‌లో భర్త, అత్తగారు, మామగారు, వదిన వేధించారని ఆరోపించింది. గణపత్ సింగ్ అనే వ్యక్తిపై కూడా వేధింపుల ఆరోపణలు చేసింది. గణపత్ సింగ్‌తో కలిసి మహిళను భర్త శారీరకంగా వేధించినట్లు గుర్తించారు.**

## నేరస్థులను పార్టీల్లో చేర్చుకునేవారికి ఎన్నేండ్లు జైలుశిక్ష విధించాలి



నేరస్థులను పార్టీల్లో చేర్చుకుని తరువాత వారిని ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రిగా చేస్తున్న వ్యక్తులకు ఎన్నేండ్లు జైలు శిక్ష విధించాలని కేంద్ర మంత్రి అమిత్‌షాను మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో కేజ్రీవాల్ సోమవారం ఒక పోస్టు చేశారు. స్కాముల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులను బీజేపీ తన పార్టీలోకి చేర్చుకోవడాన్ని కేజ్రీవాల్ విమర్శించారు. 'తీవ్రమైన నేరాలకు పాల్పడిన నేరస్థులను తమ పార్టీలో చేర్చుకుని, వారి కేసులన్నీ కొట్టివేసి, వారిని మంత్రులుగా, ఉపముఖ్యమంత్రులుగా, ముఖ్యమంత్రులుగా చేసే వ్యక్తి తన పదవికి రాజీనామా చేయాల్సిన అవసరం లేదా? అలాంటి వ్యక్తికి ఎన్ని సంవత్సరాల జైలు శిక్ష విధించాలి?' అని కేజ్రీవాల్ తన పోస్టులో ప్రశ్నించారు. మరో పోస్టులో 'కేంద్రం ప్రభుత్వం రాజకీయ కుట్రతో నన్ను తప్పుడు కేసులో ఇరికించి జైలుకు పంపినప్పుడు నేను 160 రోజులు పాటు ప్రభుత్వాన్ని జైలు నుంచి నడిపాను' అని కూడా కేజ్రీవాల్ తెలిపారు. తాను జైలు నుంచి ప్రభుత్వాన్ని నడిపిన సమయంలో విద్యుత్ కోతలు లేవని, మంచినీరు అందుబాటులో ఉండేదని, ఆసుపత్రుల్లో ఉచిత పరీక్షలు, మందులు అందాయని తెలిపారు. ప్రయివేటు పాఠశాలలు ఏకపక్షంగా, గుండాయిజం చేయడానికి అనుమతించలేదని కేజ్రీవాల్ గుర్తు చేశారు. అయితే గత ఏడు నెలల్లో బీజేపీ ప్రభుత్వం ని దారుణమైన స్థితికి తీసుకొచ్చిందని, ప్రజలు జైలు నుంచి పనిచేసిన ప్రభుత్వమే బాగుందని గుర్తుంచుకుంటున్నారని కేజ్రీవాల్ తెలిపారు. 130వ రాజ్యాంగ సవరణ బిల్లుకు మద్దతుగా అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు ప్రతిస్పందనగా కేజ్రీవాల్ ఈ ప్రశ్నలు వేశారు. ఇటీవల ఒక ఇంటర్వ్యూలో అమిత్ షా మాట్లాడుతూ జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడపాలని ప్రశ్నించారు. జైలు శిక్ష పడినప్పుడే కేజ్రీవాల్ రాజీనామా చేసి ఉండాల్సిందని అమిత్ షా అన్నారు.

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in